# కాస్త ఉపశమనం..!

- మధ్యతరగతి ప్రజలు, వేతన జీవులకు ఊరట
- ఎంఎస్ఎంఈలకు ప్రోత్సాహం
- కిసాన్ క్రెడిట్ పరిమితి పెంపు
- సెంట్రల్ యూనివర్సిటీకి నిధులు
- పట్టణ పేదలకు యూపీఐ లింక్ క్రెడిట్ కార్డులు
- టర్మ్ లోన్ స్కీమ్‌తో ఎస్సీ, ఎస్టీ మహిళలకు రుణాలు
- రైల్వేకు గత ఏడాది కంటే తగ్గిన కేటాయింపులు
- కేంద్ర బడ్జెట్‌పై అధికార పక్షం మోదం.. విపక్షం పెదవి విరుపు





అనంతపురం, ఫిబ్రవరి1(ఆంధ్రజ్యోతి): పార్లమెంటులో శనివారం ప్రవేశపెట్టిన కేంద్ర బడ్జెట్ కొందరికి మోదం... మరికొందరికి ఖేదం కలిగించింది. ఆర్థికశాఖ మంత్రి హోదాలో నిర్మలా సీతారామన్ వరుసగా 8వసారి బడ్జెట్‌ను ప్రవేశపెట్టారు. రూ.50 లక్షల కోట్లకు పైబడిన బడ్జెట్‌ను ఆమె ప్రవేశపెట్టారు. ఈ బడ్జెట్ వెనుకబడిన అనంత ఉమ్మడి జిల్లాకు అరకొరగానే ప్రయోజనం చేకూర్చుతోందనే వాదనలు వినవస్తున్నాయి. కేంద్ర బడ్జెట్‌లో ప్రధానంగా మధ్యతరగతి ప్రజలు, వేతన జీవులకు ఊరట లభించింది. రైతాంగానికి కిసాన్ క్రెడిట్ రుణ పరిమితి పెంపుతో కొంత లబ్ధి చేకూరింది. రాష్ట్ర విభజన నేపథ్యంలో... ఇచ్చిన హామీల ఊసే లేకపోవడం... వెనుకబడిన జిల్లాలకు బుందేల్‌ఖండ్ తరహా ప్యాకేజీ నిధుల ప్రస్తావనే లేకపోవడం తీవ్ర నిరాశను కలిగించింది. జిల్లాలో కేంద్రీయ విశ్వవిద్యాలయ భవన నిర్మాణాలు పూర్తిచేసి అందుబాటులోకి తీసుకొచ్చేందుకు రూ. 498 కోట్లు అవసరం. అయితే దేశంలోని 37 సెంట్రల్ యూనివర్సిటీలకుగానూ వికసిత్ భారత్‌లో భాగంగా బడ్జెట్‌లో రూ. 5500 కోట్లు నిధులు కేటాయించారు. దాదాపుగా అనంత జిల్లాలోని సెంట్రల్ యూనివర్సిటీకి రూ. 200 కోట్ల నిధులు మంజూరు చేసే అవకాశాలున్నాయి. ఇక పట్టణ పేదలకు యూపీఐ లింక్డ్ క్రెడిట్ కార్డులతో...

(మిగతా 8వ పేజీలో )


## నిధులు రాబట్టడంలో చంద్రబాబు కృషి



కేంద్ర బడ్జెట్‌లో రాష్ట్రానికి నిధులు రాబట్టడంలో సీఎం చంద్రబాబునాయుడు కృషి స్పష్టంగా కనిపించింది. అన్ని వర్గాలకు సమన్యాయం చేసేలా ఆర్థికశాఖ మంత్రి నిర్మలా సీతారామన్ బడ్జెట్ ప్రవేశపెట్టారు. వ్యక్తిగత ఆదాయపు పన్ను పరిధిని రూ. 12 లక్షలకు పెంచడం సాహసోపేత నిర్ణయం. పోలవరం ప్రాజెక్టుకు రూ. 5936 కోట్లు, విశాఖ స్టీల్‌కు రూ. 3295 కోట్లు, విశాఖ పోర్టుకు రూ. 730 కోట్లు, జీరో బడ్జెట్ నేచురల్ ఫార్మింగ్‌కి రూ. 186 కోట్లు, ఏపీ ఆరోగ్య వ్యవస్థల బలోపేతానికి రూ. 162 కోట్లు, లర్నింగ్ ట్రాన్స్‌ఫర్మేషన్ ఆపరేషన్‌కి మద్దతుగా రూ. 375 కోట్లు, ఏపీలో రోడ్లు, వంతెనల ప్రాజెక్టులకు రూ. 240 కోట్లు, ఏపీ ఇరిగేషన్, లైవ్లీ హుడ్ ఇంప్రూవ్‌మెంట్ ప్రాజెక్టు 2వ దశకు రూ. 242 కోట్లు కేటాయించడం హర్షణీయం.


**-వెంకటశివుడు యాదవ్, అనంతపురం టీడీపీ జిల్లా అధ్యక్షుడు**

## ఏపీకి ప్రాధాన్యం: అంబికా, ఎంపీ , అనంతపురం



కేంద్ర మంత్రి నిర్మలా సీతారామన్ ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో ఆంధ్రప్రదేశ్‌కు ప్రాధాన్యంలభించింది. కేంద్రం నుంచి నిధులు రాబట్టడంతో సీఎం చంద్రబాబు శ్రమ ఫలించింది. పోలవరం ప్రాజెక్టు, విశాఖ స్టీల్, విశాఖ పోర్టుకు నిధులు కేటాయించడం హర్షణీయం. ఏపీ ఆరోగ్య వ్యవస్థల బలోపేతానికి రూ.162 కోట్ల కేటాయించడంతో పేదలకు మరింత మెరుగైన వైద్య సేవలు అందే అవకాశం ఉంది. సీసీ రోడ్లు, వంతెనల ప్రాజెక్టులు, ఇరిగేషన్‌కు నిధులు కేటాయించడం సంతోషకరం. కేంద్ర బడ్జెట్‌లో అన్ని రంగాలకు న్యాయం చేశారు. వ్యవసాయం, అనుబంధ రంగాలకు అత్యధిక ప్రాధాన్యం కల్పించారు. పప్పుదినుసుల ఉత్పత్తి పెంచడానికి ప్రాధాన్యత నిచ్చారు. వైద్య కళాశాల్లో సీట్లను పెంచడం ద్వారా ఎక్కువ మంది విద్యార్థులు వైద్య విద్యను అభ్యసించడానికి దోహదపడుతుంది. అధికోత్పత్తి వంగడాల కోసం ప్రత్యేక జాతీయ మిషన్ ఏర్పాటు అభినందనీయం.

## రాష్ట్రానికి అన్యాయం



రాష్ట్రంలో ఎన్డీఏ కూటమి ప్రభుత్వమున్నా... కేంద్ర బడ్జెట్‌లో రాష్ట్రానికి అన్యాయం జరిగింది. వ్యవసాయ రంగానికి ఊతమిచ్చేలా బడ్జెట్‌లో సరిపడా కేటాయింపులు లేకపోవడం బాధాకరం. కేంద్రంలో ఎన్డీఏ ప్రభుత్వం ఏర్పడటానికి ఏపీతో పాటు బీహార్ రాష్ట్ర ఎంపీలే ప్రధాన కారణం. ఇలాంటి పరిస్థితుల్లో బడ్జెట్‌లో బీహార్‌కు ఒకలాగా... ఏపీకి ఒకలాగా కేటాయింపులు చూస్తుంటే... రాష్ట్రం పట్ల కేంద్ర ప్రభుత్వం వివక్ష చూపినట్లు అనిపిస్తోంది. బీహార్‌లో ఎన్నికలు జరుగుతున్న నేపథ్యంలోనే ఆ రాష్ట్రానికి పెద్ద పీట వేసినట్లు స్పష్టంగా కనిపిస్తోంది. కేంద్ర ప్రభుత్వంలో భాగస్వాములైనా రాష్ట్రాభివృద్ధి కోసం భారీగా నిధులు దక్కించుకోవడంలో చంద్రబాబు, పవన్‌కళ్యాణ్‌లు విఫలమయ్యారు.

**- అనంత వెంకటరామిరెడ్డి, వైసీపీ జిల్లా అధ్యక్షుడు**

# అప్పుడైనా.. ఇప్పుడైనా నేనే..!

- పీడీ పోస్టుకు జూనియర్ సీడీపీఓ ప్రయత్నాలు
- ఏపీడీ వనజా అక్కమ్మకు ఇటీవలే పీడీగా అవకాశం
- వైసీపీ పాలనలో ఇన్‌చార్జ్‌గా పనిచేసిన అధికారి మళ్లీ యత్నాలు



ఐసీడీఎస్ కార్యాలయం

అనంతపురం విద్య, ఫిబ్రవరి 1 (ఆంధ్రజ్యోతి): పాలన ఏ పార్టీదైనా పెత్తనం మాత్రం తనదే ఉండాలంటూ ఓ సీడీపీఓ విశ్వప్రయత్నాలు చేస్తున్నట్లు సమాచారం. ఈక్రమం లోనే అత్యంత కీలకమైన ఐసీడీఎస్ పీడీ పోస్టును చేజిక్కించుకునేందుకు పావులు కదుపుతున్నట్లు తెలిసింది. శాఖలో చాలామంది సీనియర్లు ఉన్నా, వారందరినీ కాదని తనకే మళ్లీ పట్టం కట్టేలా కుట్రలు సాగిస్తున్నట్లు బలమైన ఆరోపణలు వినిపిస్తున్నాయి. ప్రస్తుతం ఉన్న అధికారిని ఎలాగైనా సాగనంపి, మళ్లీ ఆ పోస్టును దక్కించుకోవాలని విశ్వప్రయత్నాలు చేస్తున్నట్లు సీడీపీఓలు, ఐడీసీఎస్ ఉద్యోగుల్లో చర్చ నడుస్తోంది. కొందరు అధికార పార్టీ నాయకులను సైతం కలిసి కాకాపడుతున్నట్లు సమాచారం. అప్పటి వైసీపీ ప్రభుత్వంలో హల్‌చల్ చేసిన ఆ అధికారి ఇప్పుడు టీడీపీ ప్రభుత్వంలో కూడా చక్రం తిప్పాలని ప్రయత్నిస్తుండటంపై కొందరు బాధిత ఉద్యోగులు భగ్గుమంటున్నారు.

**జూనియర్ అయినా...**

జిల్లాలో 11 ప్రాజెక్టులు ఉన్నాయి. వీటిలో తన కంటే సీనియర్ సీడీపీఓలు ఉన్నా, వాళ్లను కాదనీ మళ్లీ పీడీ పోస్టును కొట్టేయాలని ఓ జూనియర్ సీడీపీఓ తీవ్రంగా యత్నిస్తున్నట్లు తెలిసింది. సీడీపీఓల్లో సీనియర్ అయిన కంబదూరు సీడీపీఓ వనజా అక్కమ్మకు అసిస్టెంట్ ప్రాజెక్టు డైరెక్టర్ (ఏపీడీ)గా ఇటీవల ఐసీడీఎస్ స్టేట్ డైరెక్టర్ అడ్‌హాక్ ప్రమోషన్ ఇచ్చారు. ఈ మేరకు డిసెంబరు 12న ఉత్తర్వులు జారీ చేశారు. తర్వాత వనజా అక్కమ్మ ఐసీడీఎస్ పీడీగా బాధ్యతలు స్వీకరించారు. అయితే ఆమెకు పీడీ పోస్టు దక్కడం ఓర్వలేని ఓ జూనియర్ సీడీపీఓ ఎలాగైనా ఆమెను ఆ పోస్టు నుంచి దించేసి మళ్లీ తాను ఆ పోస్టును సొంతం చేసుకోవాలని ట్రై చేస్తున్నట్లు తెలిసింది. ఇందులో భాగంగా కొందరు ఎమ్మెల్యేలను కలిసి మళ్లీ తనకు పీడీగా అవకాశం ఇప్పించాలని కూడా పావులు కదిపినట్లు సమాచారం. ఇది జరగాలంటే సీట్‌లో ఉన్న వాళ్లను పక్కకు లాగాలి. అప్పుడు సీటు ఖాళీ అయితే తాను కూర్చోవచ్చు అన్నట్లుగా కుట్రలకు తెరతీసినట్లు తెలుస్తోంది. ఇందులో భాగంగా ప్రస్తుతం ఉన్న పీడీని అప్రధాన్యమైన మహిళా ప్రాంగణానికి డెప్యుటేషన్ వేయించి, ముందుగా ఆ సీటు ఖాళీ చేయించే యత్నాలు చేసినట్లు సమాచారం. ఈక్రమంలోనే ఐసీడీఎస్ పీడీ వనజాఅక్కమ్మకు మహిళా ప్రాంగణానికి వర్క్ డెప్యుటేషన్ ఉత్తర్వులు వచ్చినట్లు తెలిసింది. ఆమె మరో 5 నెలల్లో రిటైర్డ్ కానున్నారు. ఇలాంటి పరిస్థితుల్లో ఓ జూనియర్ సీడీపీఓ చేస్తున్న కుట్రలు చూసి ఐసీడీఎస్ అధికారులు, సీడీపీఓలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. గత వైసీపీ ప్రభుత్వంలో పీడీగా వ్యవహరించి అనేక అక్రమాలు చేసి, విమర్శలు మూటగట్టుకున్న జూనియర్ సీడీపీఓ, ఇప్పుడు మళ్లీ టీడీపీ ప్రభుత్వంలో అరాచకంగా పావులు కదుపుతుండటంపై విమర్శలు వినవస్తున్నాయి.

## తొలిరోజు 157 రిజిస్ట్రేషన్లు

### విలువ పెరిగాక తగ్గుముఖం

అనంతపురం క్రైం/చెన్నేకొత్తపల్లి, ఫిబ్రవరి 1(ఆంధ్రజ్యోతి): భూముల విలువ పెంపు అమలులోకి వచ్చిన తొలిరోజు జిల్లా వ్యాప్తంగా రిజిస్ట్రేషన్లు గణనీయంగా తగ్గాయి. డాక్యుమెంట్ రైటర్లు శనివారం సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల దరిదాపుల్లో కనిపించలేదు. అత్యవసర రిజిస్ట్రేషన్లు అవసరమైనవారు, మార్ట్‌గేజ్ రిజిస్ట్రేషన్‌లకు వచ్చినవారు మాత్రమే కనిపించారు. జిల్లా వ్యాప్తంగా 12 సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల పరిధిలో 157 రిజిస్ట్రేషన్లు జరిగాయి. ఇందులో 90కు పైగా మార్ట్‌గేజ్ డాక్యుమెంట్లే ఉన్నాయి. రామ్‌నగర్ సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో అత్యధికంగా 33, అత్యల్పంగా పామిడిలో ఒక రిజిస్ట్రేషన్ జరిగింది. అనంతపురం రూరల్‌లో 30, కళ్యాణదుర్గం 25, ఉరవకొండలో 14, గుంతకల్లు 12. తాడిపత్రిలో 10, రాయదుర్గంలో 11, శింగనమలలో 9, కణేకల్లు 8, గుత్తి 2, యాడికిలో 2, పామిడి ఒక రిజిస్ట్రేషన్ జరిగాయి. శ్రీసత్యసాయి జిల్లా పరిధిలోని చెన్నేకొత్తపల్లి సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో ఒకే ఒక్క రిజిస్ట్రేషన్ జరిగింది. సాధారణ రోజుల్లో 10 నుంచి 15 డాక్యుమెంట్లు అయ్యేవని అధికారుతు తెలిపారు. ఇది తాత్కాలికమేనని, మునుముందు రిజిస్ట్రేషన్లు పెరుగుతాయని సీకేపల్లి సబ్ రిజిస్ట్రార్ శ్రీరామ్ నాయక్ అన్నారు.

## పింఛన్ల పంపిణీలో జిల్లా ఫస్ట్

అనంతపురం క్లాక్‌టవర్, ఫిబ్రవరి 1(ఆంధ్రజ్యోతి): ఎన్టీఆర్ భరోసా పింఛన్ల పంపిణీలో రాష్ట్రంలో జిల్లా మొదటి స్థానంలో నిలిచింది. ఉదయం 6 గంటల నుంచే గ్రామ-వార్డు సచివాలయ ఉద్యోగులు పింఛన్ల పంపిణీని ప్రారంభించారు. జిల్లాలో 2,80,327 మందికి రూ.123.97 కోట్లు పంపిణీ చేయాల్సి ఉండగా తొలిరోజు శనివారం 2,69,840 మందికి రూ.119.15 కోట్లు పంపిణీ చేశారు. 96.30 శాతం పంపిణీ నమోదైంది. డీఆర్‌డీఏ-వెలుగు పీడీ ఈశ్వరయ్య పర్యవేక్షించారు.

# అభివృద్ధి.. సంక్షేమం సమతూకం

### ఆర్థిక మంత్రి పయ్యావుల కేశవ్



పాల్తూరులో పింఛన్ పంపిణీ చేస్తున్న మంత్రి పయ్యావుల

విడపనకల్లు, ఫిబ్రవరి 1(ఆంధ్రజ్యోతి): అభివృద్ధి, సంక్షేమంలో రాష్ట్ర ప్రభుత్వం సమతూకం పాటిస్తోందని రాష్ట్ర ఆర్థిక మంత్రి పయ్యావుల కేశవ్ పేర్కొన్నారు. మండలంలోని పాల్తూరు గ్రామంలో శనివారం ఎన్టీఆర్ భరోసా పింఛన్ల పంపిణీ కార్యక్రమంలో మంత్రి, కలెక్టర్ వినోద్ కుమార్‌తో కలిసి పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి కేశవ్ ఇంటింటికి వెళ్లి పింఛన్‌దారులకు పింఛన్లు పంపిణీ చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు పేదలకు రూ. 4వేల పింఛను ప్రతి నెలా 1వ తేదీన అందేలా చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. క్షేత్ర స్థాయిలో రాష్ట్రంలోని ప్రతీ ఎమ్మెల్యే, మంత్రి ఏదో ఒక గ్రామంలో పింఛన్ల పంపిణీ కార్యక్రమాన్ని పర్యవేక్షిస్తున్నట్లు వెల్లడించారు. ఆర్థికంగా ఎంతో భారమైన రాష్ట్రంలో సంక్షేమ పథకాల ను అమలు చేస్తున్నట్లు తెలిపారు. రాబోవు రోజుల్లో తల్లికి వందనం, అన్నదాత సుఖీభవ పథకాలను అమలు చేస్తామని పేర్కొన్నారు. రాష్ట్రంలో అభివృద్ధి, సంక్షేమాన్ని సమతూకంలో తీసుకెళ్లడం ముఖ్యమంత్రి చంద్రబాబుకే సాధ్యమన్నారు. కాగా మండలంలోని చీకలగురికి, ఉండబండ గ్రామాలలో టీడీపీ నాయకులు వన్నూరుస్వామి, ఓబులేసు, నారాయణస్వామి, నాగేశ్వరరావు తదితర టీడీపీ నాయకులు మంత్రి పయ్యావుల కేశవ్‌ను పూల మాలలు, శాలువాలుతో ఘనంగా సన్మానించారు. వీరభద్రస్వామి ఆలయం వద్ద ఆలయ అర్చకులు మంత్రి కేశవ్‌ను ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో వివిధ శాఖలు అధికారులు, టీడీపీ మండల కన్వీనర్ టీడీ చిన్న మారయ్య, మాజీ ఎంపీపీలు ప్రతాప్‌నాయుడు, సోముశేఖర్ నాయుడు, జడ్పీటీసీ సభ్యుడు హనుమంతు, ఆయా గ్రామాల సర్పంచ్‌లు పాల్గొన్నారు.

# అంతా అస్తవ్యస్తం

## జిల్లాలో కలగా స్టేడియం నిర్మాణం

- పీటీసీలో ఆటలకు అనుమతిపై అనుమానాలు
- పెండింగ్ కేవీకేల నిర్మాణంపై దృష్టి పెట్టేరా..?
- ఆడుదాం ఆంధ్రా క్రీడా సామగ్రి కథ అంతేనా..?



అశోక్‌నగర్ డీఎస్ఏ ఇండోర్ స్టేడియం

అనంతపురం క్లాక్‌టవర్, ఫిబ్రవరి 1(ఆంధ్రజ్యోతి): జిల్లా భారీ అవుట్‌డోర్ స్టేడియం నిర్మాణం కలగానే మిగిలింది. స్టేడియం నిర్మాణం కోసం 2019లో ఎన్నికలకు ముందు బుక్కరాయసముద్రం మండలం జంతులూరు వద్ద 15ఎకరాల స్థలాన్ని గుర్తించారు. అయితే ప్రభుత్వం మారడంతో ఇక ఆ స్థలం సీసీఎల్ఏ స్థాయిలో పెండింగ్‌లో ఉండిపోయింది. ప్రస్తుతం కూటమి పార్టీలు అధికారంలోకి రావడంతో తిరిగి స్టేడియం నిర్మాణంపై క్రీడాకారుల్లో ఆశలు చిగురించాయి.

**పీటీసీ స్టేడియం ఎవరిది..?**

జిల్లాకే తలమానికంగా ఉన్న నీలం సంజీవరెడ్డి పీటీసీ స్టేడియం ఎవరి ఆధ్వర్యంలో ఉందనే సందేహాలు వ్యక్తం అవుతున్నాయి. ఇందులో క్రీడలకు ఎవరెవరికి అనుమతి ఉంటుంది అనే అంశంపై పలు అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. 1962లో అప్పటి ఏపీ స్పోర్ట్స్ కౌన్సిల్ పీటీసీలో రూ.26లక్షలతో స్టేడియం నిర్మించారు. అయితే మారుతున్న కాలానుగుణంగా స్పోర్ట్స్ కౌన్సిల్ కాస్తా...ఏపీ రాష్ట్ర క్రీడాప్రాధికార సంస్థగా మారింది. పీటీసీ స్టేడియం పూర్తిగా పోలీసుల కంట్రోల్‌లోకి వెళ్లింది. దీంతో క్రీడాశాఖ పీటీసీ స్టేడియంలో స్వేచ్ఛ కోల్పోయింది. తాజాగా పీటీసీ స్టేడియంలో అథ్లెటిక్, వాలీబాల్ కోచ్‌ల శిక్షణకు అభ్యంతరం చెప్పినట్లు తెలిసింది. దీంతో పీటీసీ స్టేడియంలో క్రీడాకారులకు శిక్షణ ఇవ్వడానికి చాలా ఇబ్బందిగా ఉన్నట్లు కోచ్‌లు చెబుతున్నారు.

**టీడీపీ పాలనలో 19 స్టేడియాలు**

ఉమ్మడి జిల్లాకు 2014-19 మధ్య కాలంలో 19 స్టేడియాలు మంజూరయ్యాయి. ఇందులో అనంతపురం జిల్లాకు సంబంధించి నార్పల, కళ్యాణదుర్గం, రామగిరి ప్రాంతాలలోని క్రీడా వికాస కేంద్రాల నిర్మాణం అప్పటి టీడీపీ ప్రభుత్వమే పూర్తి చేసింది. అయితే రాప్తాడు నియోజకవర్గంలోని చెన్నేకొత్తపల్లి, కనగానపల్లి, గుంతకల్లు, రాయదుర్గం, తాడిపత్రి, ఉరవకొండ, కల్లూరు ప్రాంతాలలోని స్టేడియాల నిర్మాణాన్ని అసలు ప్రారంభించలేదు. ఆత్మకూరు, అనంతపురం, శింగనమల ప్రాంతాలకు మంజూరు చేసిన కేవీకేలను గత వైసీపీ ప్రభుత్వం రద్దు చేసింది. దీంతో క్రీడాకారులు స్టేడియం, కనీస వసతులు లేక నానా ఇబ్బందులు పడుతున్నారు. కాగా ఇప్పటికే ప్రారంభించి, అందుబాటులో ఉన్న కేవీకేలలో సిబ్బందిని నియమించకపోవడంతో అస్తవ్యస్తంగా మారాయి. జిల్లాలో క్రీడాకారులు, కేవీకేల సంఖ్యకు అనుగుణంగా కోచ్‌లు, సహాయ సిబ్బందిని నియమించాల్సి ఉంది.

**12 మందే కోచ్‌లు**

జిల్లాలో 30మందికి పైగా కోచ్‌లు ఉండాల్సి ఉండగా 12మంది మాత్రమే ఉన్నారు. నార్పలలో ఉన్న కోచ్ రమేష్ పలు వివాదాలతో అజ్ఞాతంలోకి వెళ్లగా, జిల్లా కేంద్రంలో పనిచేస్తున్న టేబుల్‌టెన్నిస్ కోచ్ ధనుంజయరెడ్డిని వివిధ ఆరోపణలతో విధుల నుంచి పూర్తిగా తొలగించారు. అశోక్‌నగర్ డీఎస్ఏ ఇండోర్‌స్టేడియంలో బాస్కెట్‌బాల్ కోచ్‌గా ఉన్న వంశీరెడ్డి బదిలీపై వెళ్లారు. దీంతో ప్రస్తుతం



జిల్లాకు చేరుకున్న శాప్‌చైర్మన్‌కు స్వాగతం పలుకుతున్న డీఎస్‌డీఓ, కోచ్‌లు

12మంది మాత్రమే కోచ్‌లు పనిచేస్తున్నారు. వీరిలో ఒకరిద్దరు మినహా 15రోజుల సర్టిఫికెట్ కోర్సు చేసిన వాళ్లే ఉన్నారు. పూర్తిస్థాయిలో నైపుణ్యత ఉండాలంటే కోచ్‌లకు పటియాలలో ఎన్ఐఎస్ కోర్సు చేయాల్సిన అవసరం ఉంది.

**నిధుల రికవరీ ఏదీ..?**

గత వైసీపీ ప్రభుత్వం ఎన్నికలకు ముందు చేపట్టిన ఆడుదాం ఆంధ్రా క్రీడా పోటీల్లో జిల్లాలో నిధుల దుర్వినియోగం జరిగింది. అప్పటి డీఎస్‌డీఓ నరసింహారెడ్డి క్రీడాసామగ్రి, వసతులు, రవాణా పేరుతో సుమారు రూ.80లక్షల వరకు స్వాహా చేసినట్లు ఆరోపణలు ఉన్నాయి. ఆ తరువాత వచ్చిన డీఎస్‌డీఓ షఫీ జనరేటర్, క్రీడాసామగ్రి అక్రమంగా అమ్ముకోవడం, నిధులు దుర్వినియోగం చేయడంతో రాష్ట్ర ప్రభుత్వం సస్పెండ్ చేసింది. అయితే నిధులు మాత్రం రికవరీ చేయలేకపోయింది. ఇక గత వైసీపీలో పనిచేసిన ఓ డీఎస్‌డీఓ కడప జిల్లాలో పనిచేస్తున్నారు. ఆయన తిరిగి జిల్లాలోకి వచ్చేందుకు కూటమి నేతలను ప్రసన్నం చేసుకోవడానికి అవస్థలు పడుతున్నట్లు సమాచారం. గత వైసీపీ ప్రభుత్వంలో కోట్లాది రూపాయలు వెచ్చించి కొనుగోలు చేసిన క్రీడాసామగ్రిని ఏడాదిగా నార్పల కేవీకేలో మూలన పడేశారు. సుమారు రూ.5కోట్లకు పైగా విలువ చేసే క్రీడాసామగ్రిని వెంటనే క్రీడాకారులకు అందజేసి సద్వినియోగం చేయాలని క్రీడాభిమానులు కోరుతున్నారు. ఈ నేపథ్యంలో శాప్ చైర్మన్ ఆదివారం జిల్లాకు రానున్నారు. జిల్లా క్రీడాశాఖలో నెలకొన్న అవకతవకలను సరిచేయాలని పలువురు కోరుతున్నారు. జిల్లాకు వచ్చిన శాప్ చైర్మన్‌కు జిల్లా క్రీడాసమస్యలపై ఆదివారం వినతిపత్రం అందజేసేందుకు క్రీడాకారులు సిద్ధం అయ్యారు.

# రైల్వేకు నిరాశే

**గత ఏడాది కంటే తగ్గిన కేటాయింపులు.. బడ్జెట్‌పై ఉద్యోగ సంఘాల పెదవి విరుపు**




గుంతకల్లు, ఫిబ్రవరి1(ఆంధ్రజ్యోతి): కేంద్ర బడ్జెట్‌లో రైల్వేకు నిరాశే మిగిలింది. ఆర్థిక శాఖా మంత్రి నిర్మలా సీతారామన్ శనివారం ప్రవేశపెట్టిన కేంద్ర బడ్జెట్‌లో గత ఏడాది కంటే తక్కువ బడ్జెట్‌ను రైల్వేకు కేటాయించారు. దీంతో రైల్వేల అభివృద్ధి మందకొడిగా ఉంటుందని భావిస్తున్నారు. ఉద్యోగుల ఆదాయపు పన్ను పరిధి స్లాబ్‌లను పెంచినా 8వ పే కమిషన్ వచ్చిన తర్వాత ఈ మినహాయింపులు ఎందుకూ కొరగాకుండాపోతాయని రైల్వే ఉద్యోగులు, ఉద్యోగ సంఘాల నాయకులు అభిప్రాయ పడుతున్నారు. 2017లో పార్లమెంటులో రైల్వే బడ్జెట్‌ను సాధారణ బడ్జెట్‌లో విలీనం చేసిన తర్వాత ప్రతి ఏడూ రైల్వేకు కేటాయింపుల సమాచారాన్ని కుదిస్తూ వచ్చి ఈ సంవత్సరం ఏమాత్రం వివరణల్లేకుండా మమ అనిపించారు. ఈ కారణంగా రైల్వే అధికారులు సైతం ఏ అంశానికి ఎంత కేటాయింపు జరిగిందనే విషయంగా ఏమీ చెప్పలేకపోతున్నారు. రైల్వే కేటాయింపులపై త్వరలో విడులయ్యే పింక్ బుక్‌లోనే ఏదైనా సమాచారం లభించే అవకాశం ఉంది.

### ట్రాక్ రెన్యువల్‌కు పెద్దపీట

రైల్వేకు గత సంవత్సరంతో పోలిస్తే దాదాపు రూ. ఏడు వేల కోట్ల తక్కువ బడ్జెట్‌ను కేటాయించారు. ఈ సంవత్సరం రైల్వే కేటాయింపుల్లో రైల్వేలో భద్రతా ప్రమాణాలు, రైళ్ల వేగాల పెంపు విషయంగా దృష్టిని నిలిపారు. ట్రాక్ రీప్లేస్మెంట్‌కు అత్యధిక ప్రాధాన్యమినిచ్చారు. కొత్త రైల్వే ట్రాక్ నిర్మాణం తక్కువ స్థాయిలో చేపట్టనున్నారు. గుంతకల్లు రైల్వే డివిజన్‌లో ట్రాక్ రెన్యువల్ ఆవశ్యకత ఎక్కువగా ఉంది. దేశంలో 5,500 కి.మీ.ల ట్రాక్‌ను రీప్లేస్ చేయనుండగా, కేవలం 700 కి.మీ.ల కొత్త ట్రాక్‌ను నిర్మించే లక్ష్యం పెట్టుకున్నారు.

### ఐటీ మినహాయింపుపై పెదవి విరుపు

కేంద్ర బడ్జెట్‌లో ఆదాయపు పన్ను స్లాబ్‌లను పెంచి రూ. 12 లక్షలదాకా ఆదాయ మున్నవారికి వివిధ స్థాయిల్లో ఉపశమనం కల్పించినా రైల్వే ఉద్యోగ సంఘాలు తీవ్ర నిరసనను వ్యక్తం చేస్తున్నాయి. ఈ స్లాబ్‌లను అనుసరించి గత సంవత్సరం ట్యాక్స్ పరిధిలో ఉన్న ఉద్యోగులకు రూ. 25 వేల నుంచి రూ. 1 లక్షదాకా పన్ను మినహాయింపు లభిస్తుందని, కానీ అది వచ్చే ఆర్థిక సంవత్సరానికి మాత్రమే ప్రయోజనం కలుగుతుందే తప్ప తర్వాత ఎటువంటి ఉపయోగం ఉండదని తెలియజేశారు. 8వ వేతన సవరణ సంఘాన్ని నియమించగా, దాని సిఫారసుల మేరకు వచ్చే సంవత్సరం జీతాల పెంపు, అరియర్స్ లభిస్తాయని, జీతాలు పెరిగిన తర్వాత యథాతథంగా పన్ను మొత్తాలు పెరుగుతాయని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. రూ. 12 లక్షల దాకా స్లాబ్‌ల ప్రసక్తి లేకుండా ఆదాయాన్ని పన్ను మినహాయింపు ఇవ్వాల్సి ఉందని డిమాండ్ చేస్తున్నారు.

**నిర్లక్ష్యం చేశారు: ప్రభాకర్, ఎంప్లాయిస్ సంఘ్ డివిజనల్ కార్యదర్శి**



బడ్జెట్‌లో రైల్వే శాఖకు ప్రాధాన్యం తగ్గిస్తూ వస్తున్నారు. ఈ బడ్జెట్‌లో ఏమీ ప్రకటించలేదు. రైల్వేలో ఉద్యోగితను పెంచే ఊసే లేదు. ఉద్యోగులకు ప్రకటించిన ఐటీ వెసులుబాటు పెద్దగా ఉపయోగం లేదు. వచ్చే సంవత్సరంలో 8వ వేతన సంఘ సిఫారసులు అమలై జీతాలు పెరుగుతాయి. అది తెలిసే ఐటీ స్లాబ్‌లను నామ్కేవాస్తేగా పెంచారు. జీతాలు పెరిగిన వెంటనే అన్ని వస్తువుల ధరలూ పెరిగిపోతాయి. వాటికి విధించే వ్యాట్, రాష్ట్ర పన్నుల వల్ల ఐటీ మినహాయింపు ఇచ్చినదానికంటే ఎక్కువ లాగేసుకుంటారు.

**కంటితుడుపే: మస్తాన్‌వలి, మజ్దూర్ యూనియన్ రిటైర్డు ఉద్యోగుల సంఘం డివిజన్ కార్యదర్శి**



బడ్జెట్‌లో ఇచ్చిన ఆదాయపు పన్ను మినహాయింపు వల్ల పెద్దగా ప్రయోజనం లేదు. ఇది రైల్వే ఉద్యోగులకు పెద్దగా మేలు చేయదు. పైగా దేశానికి వెన్నెముకగా ఉన్న రైల్వేను బడ్జెట్‌లో పక్కనపెట్టేస్తున్నారు. రైల్వేల అభివృద్ధిపై ప్రజలకు పారదర్శకంగా వివరించాల్సిన అవసరముంది. కొత్త రైళ్ల గురించి ప్రకటనలే లేకుండా పోయాయి.

# డ్వామాలో రగడ

## ఏపీడీ, టీఓ వాగ్వాదం

అనంతపురం క్లాక్‌టవర్, ఫిబ్రవరి 1(ఆంధ్రజ్యోతి): డ్వామా కార్యాలయంలోని వాటర్ షెడ్ విభాగంలో గొడవ జరిగింది. వాటర్‌షెడ్ అడిషినల్ ఏపీడీ సుధాకర్‌రెడ్డి, టెక్నికల్ ఆఫీసర్ రమేష్‌బాబు పరస్పరం దూషించుకుని, భౌతిక దాడికి ప్రయత్నించారు.


వాగ్వాదానికి దిగిన వాటర్‌షెడ్ ఏపీడీ సుధాకర్‌రెడ్డి, టెక్నికల్ ఆఫీసర్ రమేష్‌బాబు

సిబ్బంది వారిని అడ్డుకున్నారు. ఇదంతా డ్వామాలో పీడీ సలీం బాషా ఎదుటే శనివారం జరిగింది. కూడేరు మండలం ఇప్పేరు వాటర్‌షెడ్ ప్రాజెక్టులో టెక్నికల్ ఆఫీసర్‌గా పనిచేస్తున్న రమేష్‌బాబు, అడిషినల్ ఏపీడీ సుధాకర్‌రెడ్డి మధ్య కొంతకాలంగా పలు అంశాల్లో విబేధాలు కొనసాగుతున్నాయి. తనకు విద్యార్హత, సీనియార్టీ ఉన్నందున ఉద్యోగోన్నతి కల్పించాలని టీఓ రమేష్‌బాబు అడుగుతున్నారు. కొంత కాలం ఆగాలని ఏపీడీ చెబుతూ వచ్చారు. వీరి మధ్య వాటర్‌షెడ్ పనులు, నిధుల వినియోగం, బిల్లులు చేయడంలో విబేధాలు తలెత్తినట్లు సమాచారం. తాను పనిచేస్తున్న ఇప్పేరు వాటర్‌షెడ్ ప్రాజెక్టుకు డ్వామా పీడీ కార్యాలయంలో పనిచేస్తున్న శ్రీనివాసులును నియమించడం ఏమిటని రమేష్‌బాబు ఏపీడీని నిలదీశారు. దీంతో ఇద్దరి మధ్య మాటామాటా పెరిగింది. ఏపీడీ కక్షసాధింపులకు పాల్పడుతున్నారని, కులం పేరిట దూషిస్తున్నారని రమేష్‌బాబు ఆరోపించారు. వాటర్‌షెడ్ నిధులను పక్కదారి పట్టిస్తున్నారని, వ్యతిరేకించినందుకు కక్షపెట్టుకున్నారని ఆరోపించారు. తాను అక్రమాలకు పాల్పడలేదని, వాటర్‌షెడ్ పనులన్నీ పారదర్శకంగా జరిగాయని ఏపీడీ అన్నారు. పీడీ సలీంబాషా ఇద్దరికీ సర్దిచెప్పి పంపించారు.



# కాస్త ఉపశమనం..!

(7వ పేజీ తరువాయి)

చిరు వ్యాపారులకు లబ్ధి చేకూరినట్లయింది. అదే విధంగా టర్మ్‌లోన్ స్కీమ్‌తో ఎస్సీ, ఎస్టీ మహిళలకు రుణాలందజేసి ఆ వర్గాల ఆర్థిక స్వావలంబనకు ఊతమిచ్చారు. ఈ పథకం ద్వారా రూ.2 కోట్ల వరకూ రుణాలు అందించనున్నారు. దేశంలో 120 కొత్త విమానాశ్రయాలు ఏర్పాటు చేయనున్న నేపథ్యంలో జిల్లాలో ఇప్పటికే వినియోగంలో ఉన్న సత్యసాయి ఎయిర్ పోర్టు ద్వారా పౌరవిమానయాన సేవలు అందుబాటులోకి వచ్చే అవకాశం ఉంది.

### వేలాది మందికి ఊరట

మధ్య తరగతి, వేతన జీవులకు బడ్జెట్‌లో ఆదాయపు పన్నుకు సంబంధిచి కాస్త ఉపశమనం కలిగింది. రూ.12 లక్షల ఆదాయం వరకూ ఎటువంటి పన్ను చెల్లించాల్సిన అవసరం లేకుండా రిబేట్ ప్రకటించారు. దీంతో పాటు కొత్త ఆదాయపు పన్ను విధానంలో స్లాబులను మార్చారు. దీనికి మరో రూ. 75 వేలు స్టాండర్డ్ డిడక్షన్ కలిపితే మొత్తం మీద రూ. 12.75 లక్షల వరకూ పన్ను మినహాయించినట్లయింది. ఆదాయపు పన్ను మినహాయింపుల ద్వారా ఒక్క అనంతపురం జిల్లాలోనే మూడు లక్షల మంది చిరు, మధ్య తరహా వ్యాపారులతో పాటు 50 వేల మందికిపైగా ఉద్యోగులకు ఊరట లభించినట్లయింది. కొత్త పన్ను విధానంలో మార్చిన స్లాబులను పరిశీలిస్తే... రూ. 4 లక్షల వరకూ 0, రూ. 4 నుంచి రూ. 8 లక్షల వరకూ 5 శాతం, రూ. 8 లక్షల నుంచి రూ. 12 లక్షల వరకూ 10 శాతం, రూ. 12 నుంచి రూ. 16 లక్షలకు 15 శాతం, రూ. 16 లక్షల నుంచి రూ. 20 లక్షల వరకూ 20 శాతం, రూ. 20 లక్షల నుంచి రూ. 24 లక్షల వరకూ 25 శాతం, రూ. 24 లక్షలకుపైన రూ. 30 శాతం పన్ను విధించారు. తద్వారా ఆయా వర్గాలకు రూ. 30 వేల నుంచి రూ. 1.1 లక్షల వరకూ లబ్ధి చేకూరనుంది.



### కిసాన్ క్రెడిట్ రుణ పరిమితి పెంపు

కిసాన్ క్రెడిట్ రుణ పరిమితి ఇదివరకూ రూ. 3 లక్షలు ఉండేది. బడ్జెట్‌లో రుణ పరిమితిని రూ. 5 లక్షల వరకూ పెంచారు. అనంతపురం జిల్లాలో ఆరు లక్షల మంది, శ్రీసత్యసాయి జిల్లాలో 2.52 లక్షల రైతులున్నారు. దీంతో ఇప్పటి వరకూ అనంతపురం జిల్లాలో కిసాన్ క్రెడిట్ కార్డు పొందిన దాదాపు 2 లక్షల మంది రైతులకు ప్రయోజనం చేకూరనుంది. కిసాన్ క్రెడిట్ ద్వారా ఇచ్చే రుణాలకు వడ్డీ నాలుగు శాతం లేదా అంత కన్నా తక్కువగా ఉంటుంది. ఈ కార్డు పొందేవారికి ప్రధాన మంత్రి సురక్ష బీమా యోజన, జీవన జ్యోతి బీమాయోజన వర్తిస్తుంది.

### ఎంఎస్ఎంఈలకు ప్రోత్సాహం..

సూక్ష్మ, చిన్న, మధ్య తరహా పరిశ్రమలను ప్రోత్సహించేందుకు కేంద్రం వరాలజల్లులు కురిపించింది. సూక్ష్మ, చిన్న, మధ్య తరహా పరిశ్రమలు(ఎంఎస్ఎంఈ)కు ఇదివరకూ రూ. 5 కోట్ల వరకూ రుణాలిచ్చేవారు. తాజా బడ్జెట్‌లో ఆ రుణాలను ఏకంగా రూ. 10 కోట్లకు పెంచారు. అదే విధంగా స్టార్టప్‌లకు రూ. 10 కోట్ల నుంచి రూ. 20 కోట్లకు రుణాలు పెంచారు. ఈ విషయానికొస్తే... అనంత జిల్లాలో 43 వేలు, శ్రీ సత్యసాయి జిల్లాలో 8600 ఎంఎస్ఎంఈలకు లబ్ధి చేకూరనుంది.

### సామాన్యులకు సాంత్వన



కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్ సామాన్య ప్రజలకు సాంత్వన కలిగించింది. పోలవరం ప్రాజెక్టుకు రూ. 400 కోట్లు, విశాఖ పోర్టుకు రూ. 445 కోట్లు కేటాయించడం శుభపరిణామం. పేద, మధ్య తరగతి ప్రజలకు ఈ బడ్జెట్ ఊరట కలిగించింది. ఏపీకి ఈ స్థాయిలో నిధులు రావడంలో ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు కృషి ఉంది. పలుమార్లు ఢిల్లీకి వెళ్లి రాష్ట్ర పరిస్థితులు వివరించి భారీ స్థాయిలో నిధులు రాబట్టారు.

**- దగ్గుపాటి వెంకటేశ్వరప్రసాద్, అనంతపురం అర్బన్ ఎమ్మెల్యే**

### విద్యార్థులను ప్రయోజకులుగా తీర్చిదిద్దే బడ్జెట్



రాష్ట్రంలో ఇంటికొక సాఫ్ట్‌వేర్ ఉద్యోగి, వ్యాపారవేత్తను తయారుచేయాలన్నది సీఎం ఆకాంక్ష. వర్క్ ఫ్రమ్ హోమ్ అవకాశాన్ని కల్పించేందుకు మండలానికొక టెక్‌టవర్‌ను ఏర్పాటుచేసి నిరుద్యోగాన్ని రూపుమాపాలనే లక్ష్యాన్ని పెట్టుకున్నారు. ఈ అంశాలకు ఊతమిచ్చి విద్యార్థులను ప్రయోజకులుగా తీర్చిదిదానికి కేంద్రం ప్రవేశపెట్టిన బడ్జెట్ దోహదపడుతుంది. విద్య, వ్యవసాయం, పరిశ్రమల రంగాలతోపాటు అమరావతి, విశాఖ స్టీల్ ప్లాంట్ తదిరాలకు బడ్జెట్‌లో సముచిత స్థానం కల్పించారు.

**- ప్రొఫెసర్ సుదర్శనరావు, జేఎన్టీయూ ఇన్‌చార్జ్ వీసీ**

### ప్రజావ్యతిరేక బడ్జెట్



వెనుకబడిన జిల్లాలకు నిధుల కేటాయింపు ఊసే లేకపోగా... రాష్ట్రాభివృద్ధికి నిధులు కేటాయించలేదు. బిహార్‌కు రూ. వేల కోట్ల నిధులు కేటాయిస్తుంటే బడ్జెట్ ప్రసంగంలో రాష్ట్రం గురించి గానీ, రాష్ట్రాభివృద్ధికి నిధుల కేటాయింపులు గురించి ఊసేలేకపోవడం బాధా కరం. వివక్షకు ఇదే నిదర్శనం. వ్యవసాయరంగాన్ని పూర్తిగా కార్పొరేట్ కంపెనీలకు అప్పగించేందుకు బడ్జెట్‌లో అనేక ప్రతిపాదనలు చేశారు. సుదీర్ఘ కాలం పాటు రైతులు పోరాడుతున్న వ్యవసాయ కుట్ర చట్టాలు, రైతు ఆత్మహత్యలపై ఒక్క మాట మాట్లాడలేదు. ఇదొక ప్రజావ్యతిరేక బడ్జెట్.

**- రాంభూపాల్, సీపీఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు**

### రాష్ట్రానికి మొండి చేయి



కేంద్ర బడ్జెట్‌లో రాష్ట్రానికి నిధుల కేటాయింపులో మొండి చేయి చూపారు. రాష్ట్రంలోని కొత్త ప్రాజెక్టులకు నిధులు ఇవ్వకపోడం కూటమి వైఫల్యానికి నిదర్శనం. కేంద్ర బడ్జెట్ సంతృప్తికరంగా లేదు. మధ్య తరగతి ఉద్యోగులకు ఇన్‌కం ట్యాక్స్ మినహాయింపులు తప్పా, కొత్తదనం ఏమీ లేదు. ప్రభుత్వ రంగసంస్థలను, ప్రైవేట్ వైపు మళ్లించడానికి కేంద్ర ప్రభుత్వం ద్వారాలు తెరిచింది. విదేశీ పెట్టుబడులకు రెడ్ కార్పెట్ పరిచి, దేశీయసంస్థలను నిర్వీర్యం చేసేలా బడ్జెట్ ఉంది.

**- ఎమ్మెల్సీ శివరామిరెడ్డి, ఉరవకొండ**

### ప్రభుత్వ విద్యకు గ్యారెంటీ లేదు



బీజేపీ ఎన్నికల ప్రణాళికలో విద్యారంగానికి ప్రాధాన్యం ఇస్తామని చేసిన వాగ్దానానికి అనుగుణంగా బడ్జెట్‌లో నిధుల కేటాయింపులు లేదు. రూ. 50.65 లక్షల కోట్ల బడ్జెట్‌లో విద్యారంగానికి కేవలం రూ. 1.28 లక్షల కోట్లు కేటాయించడమంటే హామీని నీరుగార్చడమే. మొత్తం బడ్జెట్‌లో 2.53 శాతం ప్రభుత్వ విద్యకు బడ్జెట్ కేటాయించి మమ అనిపించారు. దీన్నిబట్టి చూస్తే... ప్రభుత్వ విద్యకు గ్యారెంటీ లేదన్నది స్పష్టంగా అర్థమవుతోంది. గత బడ్జెట్‌లో కంటే 0.03 శాతం నిధులు తగ్గించారు.

**- కోనంకి అశోక్‌కుమార్, ఏపీటీఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు**

### ఏడుపుగొట్టు బడ్జెట్



కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టినది ఏడుపుగొట్టు బడ్జెట్. కేంద్రంలో బీజేపీ అధికారంలోకి వచ్చిన తరువాత దేశంలో వృద్ధి రేటు పెరగలేదు. ఎగుమతులు లేవు. విదేశీ పెట్టుబడులు రావడం లేదు. ప్రభుత్వరంగం కునారిల్లుతోంది. బిహార్, ఢిల్లీ ఎన్నికలను దృష్టిలో ఉంచుకొని మధ్యతరగతి ప్రజలకు ఊరట కలిగించే విధంగా పన్ను మినహాయింపు ఇచ్చినట్లు స్పష్టంగా కనిపిస్తోంది. వెనుకబడిన జిల్లాలకు కేటాయించిన నిధుల ఊసే లేదు. విభజన హామీల అమలును గాలికొదిలేశారు.

**- జగదీష్, సీపీఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు**

### పరిశోధన, ఆవిష్కరణలకు దోహదం



వర్సిటీలకు బలమైన పునాదుల్లాంటి పరిశోధన, అవిష్కరణలను బలోపేతం చేసేందుకు కేంద్రం ప్రవేశపెట్టిన బడ్జెట్ దోహదపడుతుంది. అటల్ టింకరింగ్ ల్యాబ్‌ల సౌకర్యాల కల్పనకు, విద్యాసంస్థల బ్రాడ్‌బ్యాండ్‌ను మెరుగు పరిచేందుకు. యువత అభివృద్ధిని పెంపొందించేలా పెట్టుబడులకు పెద్దపీట వేశారు. తక్కువ జీతాలు పొందే ఉద్యోగులకు ట్యాక్స్ అంశంలో ఉపశమనం కల్పించారు. స్థిరమైన అభివృద్ధి లక్ష్యంగా బడ్జెట్‌ను ప్రవేశపెట్టడం ప్రశంసనీయం..

**-ప్రొఫెసర్ అనిత, ఎస్కేయూ ఇన్‌చార్జ్ వీసీ**

### రూ.5500 కోట్ల నిధులు



దేశవ్యాప్తంగా 37 సెంట్రల్ యూనివర్సిటీలకు రూ.5500 కోట్ల నిధులను కేటాయించారు. వీటిని వర్సిటీల అవసరాలకు విడతల వారిగా చెల్లించనున్నారు. మనకు రెండో విడతలో రూ.498 కోట్లు రావాలి. కేపిటల్, శాలరీస్, రికరింగ్ విభాగాల వారిగా నిధులను సద్వినియోగం చేసుకోవాలి. మౌలిక వసతులను మెరుగు పరుచుకుని వికసిత్ భారత్‌లో సెంట్రల్ యూనివర్సిటీలను భాగస్వామ్యం చేయాలన్న ముందుచూపుతో నిధులు కేటాయించడం హర్షణీయం.

**- ప్రొఫెసర్ ఎస్ఏ కోరి, సెంట్రల్ యూనివర్సిటీ వీసీ**

### మధ్యతరగతి అభ్యున్నతికి ఊతం



కేంద్ర బడ్జెట్ పేద, మధ్య తరగతి వర్గాల అభ్యున్నతికి ఊతమిచ్చేలా ఉంది. సామాన్యుల సంక్షేమానికి అత్యుత్తమ బడ్జెట్. ప్రజలపై పన్నుల భారం తగ్గించడం అభినందనీయం. ఇప్పుడు నెలకు లక్షరూపాయలు సంపాదించేవారికి కూడా పన్నులేదు. ఏపీలో వెనుకబడిన జిల్లాలకు 155కోట్లు రూపాయలు ప్రకటించడం అభినందనీయం. కిసాన్‌కార్డుద్వారా రైతాంగానికి రూ.మూడులక్షల నుంచి రూ.5లక్షల వరకు రుణపరిమితి పెంచడం హర్షణీయం.

**- పల్లె సింధూరా రెడ్డి, ఎమ్మెల్యే పుట్టపర్తి**

### రాష్ట్రానికి అగ్రతాంబూలం



ముఖ్యమంత్రి చంద్రబాబు చొరవతో కేంద్ర బడ్జెట్‌లో రాష్ట్రానికి అగ్ర తాంబూలం లభించింది. పోలవరం ప్రాజెక్టు నిర్మాణానికి నిధులు, అమరావతి నిర్మాణంతోపాటు, విమానాశ్రయ కనెక్టివిటీ లేని ప్రాంతాల్లో ఉడాన్ పథకం కింద చిన్న చిన్న విమానాశ్రయాలకు, హెలీప్యాడ్ నిర్మించే పథకాన్ని బడ్జెట్‌లో ప్రతిపాదించడం రాష్ట్రాభివృద్ధికి శుభ పరిణామం. పేదల సంక్షేమానికి బడ్జెట్ ఎంతగానో ఉపయోగపడుతుంది. డబుల్ ఇంజన్ సర్కార్‌వల్ల రాష్ట్రానికి మేలే జరుగుతోంది.

**- ఎంఎస్ రాజు, ఎమ్మెల్యే, మడకశిర**

### మిడిల్ క్లాస్ ఫ్యామిలీ బడ్జెట్



కేంద్రం ప్రవేశపెట్టిన బడ్జెట్ మిడిల్ క్లాస్ ఫ్యామిలీకి చాలా అనుకూలంగా ఉంది. 40 ఏళ్లలో ఎప్పుడూ లేని విధంగా బడ్జెట్‌ను తయారు చేశారు. రూ. 12లక్షల లోపు ఆదాయం ఉన్న వాళ్లకు పన్ను మినహాయింపు ఇవ్వడం చాలా బాగుంది. వెనుకబడిన జిల్లా ప్రజలకు చాలా అనుకూలంగా ఉంటుంది. మైక్రో రుణాలద్వారా ఉపాధి పొంది కోట్లాది మంది జీవనోపాధి పొందుతారు. రైతులకు ఐదు లక్షల అందించి వారు బాగోగుల గురించి ఆలోచించి ఉంటే బాగుండేది.

**- రాంప్రసాద్, చాంబర్‌ఆఫ్ కామర్స్ జిల్లా అధ్యక్షుడు, హిందూపురం**

### సామాన్యుల బడ్జెట్



కేంద్రం ప్రవేశపెట్టిన బడ్జెట్ సామాన్యులకు అనుకూలంగా ఉంది. రాష్ట్రానికి న్యాయం జరిగింది. పోలవరం, విశాఖ స్టీల్‌ప్లాంటుకు కేంద్ర ప్రభుత్వం నిధులు కేటాయించింది. యువత ,మహిళలు, నిరోద్యోగులు, రైతులను దృష్టి పెట్టుకుని అనేక కేటాయింపులు చేశారు. వేతన జీవులకు ఊరట కలిగించారు. ప్రపంచంలో భారత దేశం సూపర్ పవర్ కావడానికి ఈబడ్జెట్ ఎంతో ఉపయోగపడుతుంది. పారిశ్రామికంగా అభివృద్ధి చెందడానికి ఎంఎస్ఎంఎను ప్రోత్సహించింది. ఇది సామాన్యుల అనుకూల బడ్జెట్.

**- ఎమ్మెల్యే కందికుంట వెంకటప్రసాద్**

# పాడి రైతులకు మూడు రోజుల శిక్షణ

బుక్కరాయసముద్రం, ఫిబ్రవరి1(ఆంధ్రజ్యోతి): జాతీయ పశుగణన మిషన్‌లో భాగంగా రైతులకు పాడి పశువుల పెంపకంపై మూడు రోజులు పాటు శిక్షణ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ప్రాంతీయ పశుసంవర్థక శిక్షణ కేంద్రం ప్రిన్సిపాల్ రామచంద్రారెడ్డి తెలిపారు. ఈ మేరకు శనివారం ఆయన ఓ ప్రకటన విడుదల చేశారు. ఈ కార్యక్రమం మండలంలోని రెడ్డిపల్లి వద్ద జరుగుతుందన్నారు. పాడి పశువుల ఎంపిక, మెలకువలు, పశువుల ఉత్పత్తి పెంచటానికి తీసుకోవాల్సిన జాగ్రత్తలు, పోషణ వ్యాధులు, లేగ దూడల పెంపకం తదితర అంశాలపై శిక్షణ తరగుతులు నిర్వహిస్తామన్నారు. క్షేత్రస్థాయి సందర్శన కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ శిక్షణ కేంద్రంలో పాల్గొనే రైతులు వెటర్నరీ ఏడీ వినోద్ 9701110362, గోల్డ్‌స్మన్ 8328205176, రామచంద్రరెడ్డి 8790997554లకు ఫోన్ చేసి పేరు నమోదు చేసుకోవాలని సూచించారు. జిల్లాలోని రైతులు ఎవరైనా పాల్గొనవచ్చుని సూచించారు.

వెటర్నరీ శిక్షణ కేంద్రం ప్రిన్సిపాల్ రామచంద్రారెడ్డి

### వేతన జీవులకు మేలు



కేంద్ర బడ్జెట్‌లో వేతన జీవులకు మేలు జరిగింది. ఏటా రూ.12లక్షల వరకు ఆదాయపు పన్ను కట్టన వసరం లేకపోవడం ఎంతో ఊరటనిచ్చే అంశం. దీంతో మధ్యతరగతి ప్రజలు లబ్ధి పొందనున్నారు. యువత నైపుణ్య శిక్షణ కోసం ప్రత్యేక కేంద్రాలు ఏర్పాటు చేయడం అభినందనీయం. మధ్యతరగతి ప్రజల కోసం 40వేల ఇళ్లు కేటాయించడం ఎంతో మంచిది.

**- చిలకం మధుసూదన్‌రెడ్డి, జనసేన**

### అభినందనీయం



కేంద్ర బడ్జెట్ అభినందనీయం. ముఖ్యమంత్రి చంద్రబాబు కృషి వల్ల బడ్జెట్‌లో రాష్ట్రానికి అత్యధికంగా నిధులు కేటాయించడం శుభ సూచకం. గత వైసీపీ ప్రభుత్వం కేంద్రం నుంచి రాష్ట్రానికి నిధులు తేవడంలో పూర్తిగా విఫలమైంది. రాష్ట్రంలో సమర్థవంతమైన నాయకుడు చంద్రబాబు ఉండటం వల్లే నిధులు తేగలిగారు. నిధులు కేటాయించినందుకు ప్రధాని మోదీ కృతజ్ఞతలు.

**- గుండుమల తిప్పేస్వామి, టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు**

## సర్వర్ సతాయింపు

అనంతపురం టౌన్, ఫిబ్రవరి 1(ఆంధ్రజ్యోతి): సర్వర్ మొరాయించడంతో చౌకధాన్య డిపోల వద్ద రేషన్‌కార్డుదారులు వనివారం బారులు తీరారు. డీలర్లు మధ్యాహ్నం వరకూ కొందరికి బియ్యం పంపిణీ చేసి.. ఆ తరువాత మూసేశారు. తిరిగి సాయంత్రం 4 గంటల తరువాత ప్రయత్నించినా.. సర్వర్ సహకరించలేదు. ఆలస్యం అయితే సరుకుల్లో కోత పడుతుందని భావించి, మొదటి రోజే కార్డుదారులు క్యూ కట్టారు. అధికారులు స్పందించి, సర్వర్ సమస్యను పరిష్కరించాలని కోరుతున్నారు.


సర్వర్ పని చేయకపోవడంతో ఆజాద్ నగర్ స్టోర్ వద్ద కూర్చున్న కార్డుదారులు

## యువరైతు ఆత్మహత్య

నార్పల, ఫిబ్రవరి 1(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని వెంకటాంపల్లి గ్రామానికి చెందిన యువరైతు నాగప్రసాద్(32) అప్పుల బాధతో పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకున్నాడు. నాగప్రసాద్ ఆరు ఎకరాల పొలంలో ఐదేళ్లుగా టమోటా, మిరప, కలింగర తదితర పంటలు సాగు చేసి నష్టపోయాడు. సేద్యానికి తెచ్చిన అప్పులు రూ.11 లక్షలు పేరుకుపోయాయి. రుణదాతల నుంచి ఒత్తిడి పెరగడంతో నార్పల శివారులో శుక్రవారం పురుగుల మందు తాగి, అపస్మారకస్థితిలో పడిపోయాడు. స్థానికులు గమనించి అనంతపురం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. చికిత్స పొందుతూ శనివారం సాయంత్రం మృతిచెందాడు. నాగప్రసాద్‌కు భార్య మౌనిక, ఇద్దరు కుమారులు ఉన్నారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ సాగర్ తెలిపారు.


నాగప్రసాద్ (ఫైల్)

### టీసీసీ- 2024 సర్టిఫికెట్లు తీసుకెళ్లండి

అనంతపురం విద్య, ఫిబ్రవరి 1(ఆంధ్రజ్యోతి): గత ఏడాది ఏప్రిల్‌లో టీసీసీ రాసిన అభ్యర్థుల సర్టిఫికెట్లు డీఈఓ ఆఫీస్ అందుబాటులో ఉన్నాయని డీఈఓ ప్రసాద్‌బాబు, ఏసీ గోవింద్ నాయక్ శనివారం తెలిపారు. టీసీసీ- 2024లో డ్రాయింగ్, టైలరింగ్, ఎంబ్రాయిడరీ లోయర్ గ్రేడ్ టెక్నికల్ టీచర్స్ సర్టిఫికెట్ పరీక్షలు రాసిన అభ్యర్థులు తమ సర్టిఫికెట్లు తీసుకోవచ్చని తెలిపారు. అభ్యర్థులు ఏప్రిల్ ఎగ్జామ్ హాల్‌టికెట్లతోపాటు, ఆధార్ కార్డును తీసుకుని కమలా నగర్‌లోని డీఈఓ ఆఫీస్ పరీక్షల విభాగంలో సంప్రదించాలని సూచించారు.

# రైతులు నష్టపోకుండా చూస్తాం

● ఎమ్మెల్యే పరిటాల సునీత


కందుల కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న పరిటాల సునీత

అనంతపురంరూరల్, ఫిబ్రవరి 1 (ఆంధ్రజ్యోతి): కరువు జిల్లాలోని రైతులు నష్టపోకుండా చూస్తామని ఎమ్మెల్యే పరిటాల సునీత అన్నారు. శనివారం మండలంలోని రాచానపల్లి గ్రామం వద్దనున్న ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘం ఆధ్వర్యంలో కందులు కొనుగోలు కార్యక్రమం చేపట్టారు. కార్యక్రమానికి ఎమ్మెల్యే హాజరై ప్రారంభించారు. పలువురు రైతులు తమ సమస్యలను ఆమె దృష్టికి తెచ్చారు. ప్రభుత్వం ఎకరాకు 2.5 క్వింటాళ్ల కందులు మాత్రమే కొనుగోలు చేస్తోందని, దీని వల్ల ఇబ్బందులు తలెత్తుతున్నాయన్నారు. ఎమ్మెల్యే స్పందిస్తూ ఎకరాకు ఐదు క్వింటాళ్ల వరకు కందులు కొనుగోలు చేయాలని, ఆమేరకు వ్యవసాయ శాఖ మంత్రి అచ్చెన్నాయుడుకి ఫోన్ ద్వారా రైతులు విజ్ఞప్తులను తీసుకెళ్లారు. మంత్రి సానుకూలంగా స్పందించారు. సంబంధిత ఉన్నతాధికారులు, ముఖ్యమంత్రి చంద్రబాబు దృష్టికి తీసుకెళ్లి పూర్తిస్థాయిలో కొనుగోలు చేసేలా చూస్తామన్నారు. మండల కన్వీనర్ జింకాసూర్యనారాయణ, మాజీ జడ్పీటీసీ వేణుగోపాల్, రఘు, పాముదాయి వెంకటేష్, లక్ష్మీనారాయణ, నారాయణస్వామి, క్రిష్టారెడ్డి, నారాయణరెడ్డి, కొండయ్య, సర్దానప్ప, అల్లీపీర, నాగరాజు. ఎర్రిస్వామి, బుల్లెట్ రఫీ, బొజ్జయ్య, గోపాల్, రవి పాల్గొన్నారు.

**సమగ్ర శిక్ష విభాగాన్ని అవినీతి మయం చేశారు**

గత ప్రభుత్వంలో సమగ్ర శిక్ష విభాగాన్ని అవినీతి మయం చేశారని ఎమ్మెల్యే పరిటాల సునీత అన్నారు. శనివారం అనంతపురంలోని తన క్యాంప్ కార్యాలయంలో ఉమ్మడి జిల్లా సమగ్ర శిక్ష విభాగం అధికారులతో ఆమె సమావేశమయ్యారు. నియోజకవర్గం పరిధిలోని ఆరు మండలాల్లో సమగ్ర శిక్ష పాఠశాలల్లో జరుగుతున్న పనులు, మౌలిక సదుపాయాలు, సిబ్బంది కొరత తదితర అంశాలపై సమీక్షించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ వంద రోజుల యాక్షన్ ప్లాన్‌లో భాగంగా పేరూరు ఎంజేపీ బాలుర గురుకుల పాఠశాల మరమ్మతులకు రూ.44 లక్షలు, నసనకోటలో రూ.25 లక్షలతో పనులు చేపట్టాలన్నారు.

**అర్హులైన వారందరికీ పింఛన్లు**

రామగిరి అర్హులైన వారందరికీ పింఛన్లు అందుతాయని ఎలాంటి ఆందోళన చెందవద్దని ఎమ్మెల్యే పరిటాలసునీత అన్నారు. మండలంలోని నసనకోట పంచాయతీ ముత్యాలంపల్లి గ్రామంలో శనివారం పింఛన్ల పంపిణీ చేపట్టారు. ఉదయాన్నే ఆమె గ్రామానికి వెళ్లి పింఛన్ల పంపిణీ కార్యక్రమంలో పాల్గొన్నారు. టీడీపీ సీనియర్ నాయకులు రామ్మూర్తినాయుడు, మండల కన్వీనర్ సుధాకర్, ఎంఈఓ శ్రీనివాసులు, ఎంసీ పల్లి మాజీ సర్పంచ్ ముత్యాలప్ప, నాయకులు మారెన్న, సత్యనారాయణ, వడ్డివెంకటేశ్ పాల్గొన్నారు.

## లఘుచిత్రోత్సవ్‌కు 86 చిత్రాల ఎంపిక

అనంతపురం కల్చరల్, ఫిబ్రవరి 1(ఆంధ్రజ్యోతి): అనంత షార్ట్‌ఫిల్మ్ సొసైటీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న 7వ లఘుచిత్రోత్సవ పోటీలకు 18 విభాగాల్లో 86 లఘుచిత్రాలను ఎంపిక చేసినట్లు సొసైటీ వ్యవస్థాపకుడు రషీద్‌బాషా తెలిపారు. శనివారం నగరంలోని విద్యుత్ కళావేదికలో విలేకరుల సమావేశం నిర్వహించి వివరాలు వెల్లడించారు. పోటీలకు రెండు తెలుగు రాష్ట్రాలతోపాటు కర్ణాటక నుంచి పోటీదారులు పంపారన్నారు. వాటన్నింటినీ జనవరి 28, 29వ తేదీల్లో విద్యుత్ కళావేదిక ప్రివ్యూ థియేటర్‌లో తనతోపాటు హైదరాబాద్‌కు చెందిన డైరెక్టర్ వెంకట్ కట్టా, విజయవాడకు చెందిన వెంకటేశ్వరరావు పరిశీలించి మొత్తం 18 విభాగాల్లో 86 లఘుచిత్రాలను పోటీలకు ఎంపిక చేయడం జరిగిందన్నారు. సొసైటీ సభ్యులు తోట బాలన్న, యాంకర్ రమేష్, గోపాలకృష్ణ పాల్గొన్నారు.

## ఇంటి నిర్మాణానికి రూ.5 లక్షలు ఇవ్వాలి

అనంతపురం విద్య, ఫిబ్రవరి 1(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం పేదలకు ఇంటి నిర్మాణం కోసం రూ.5 లక్షలు మంజూరు చేయాలని సీపీఐ జిల్లా కార్యదర్శి జాఫర్ డిమాండ్ చేశారు. శనివారం నగర కార్యదర్శి శ్రీరాములు ఆధ్వర్యంలో పాతూరు వీరబ్రహ్మేంద్రస్వామి గుడిలో పలు కాలనీల్లోని పేదల నుంచి ఇళ్ల పట్టాల కోసం దరకాస్తులు స్వీకరణ కార్యక్రమం చేపట్టారు. జాఫర్ మాట్లాడుతూ కొందరు పట్టాల పేరుతో దందా చేస్తున్నారన్నారు. ప్రజలు ఎవరి మాటలు నమ్మవద్దని, సీపీఐతోనే పేదలకు న్యాయం జరుగుతుందన్నారు. గతంలో వైసీపీ ప్రభుత్వంలో జగనన్న లేఅవుట్లలో ఇచ్చిన స్థలాలను మార్పు చేసి 3 సెంట్లు, 2 సెంట్లుగా మళ్లీ పేదలకు ఇవ్వాలని కోరారు. రమణయ్య,అల్లిపీరా, సంతోష్ కుమార్, ఖాజా హుస్సేన్, చాంద్‌బాషా, నాగప్ప, మురళి పాల్గొన్నారు.

## జువైనల్ అధికారులకు అవగాహన

అనంతపురం క్రైం, ఫిబ్రవరి 1(ఆంధ్రజ్యోతి): జిల్లా న్యాయసేవాధికార సంస్థ ఆధ్వర్యంలో శనివారం ఉమ్మడి జిల్లాకు చెందిన జువైనల్ అధికారులకు అవగాహన కల్పించారు. న్యాయసేవాధికార సంస్థ భవనంలో నిర్వహించిన సదస్సుకు జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి శివప్రసాద్ యాదవ్ హాజరయ్యారు. జువైనల్ జస్టిస్ యాక్ట్, అరెస్ట్, రిమాండ్ విషయాల్లో వ్యవహరించాలనే విషయంపై అవగాహన కల్పించారు. అదేవిధంగా లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సిల్ సిస్టం గురించి వివరించారు. ఐటికె నల్లప్ప, అనంతపురం, శ్రీ సత్యసాయి జిల్లాల జువైనల్ అధికారులు పాల్గొన్నారు.

## సుప్రీం కోర్టు వ్యాఖ్యలు అన్యాయం

అనంతపురం సెంట్రల్, ఫిబ్రవరి 1(ఆంధ్రజ్యోతి): అట్రాసిటీపై సుప్రీం కోర్టు ధర్మాసనం చేసిన వ్యాఖ్యలు అన్యాయని ఎస్సీ, ఎస్టీ సంఘాల జేఏసీ రాష్ట్ర అధ్యక్షులు వాపోయారు. సుప్రీం కోర్టు వ్యాఖ్యలకు నిరసనగా శనివారం అంబేడ్కర్ విగ్రహంవద్ద ఏర్పాటుచేసిన ఆందోళనలో సాకేహరి మాట్లాడారు. కులవివక్షను రూపుమాపేలా దశాబ్దాల తరబడి పోరాటాలుచేసిన ఫలితంగా ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ చట్టాన్ని తీసుకువచ్చారన్నారు. సుప్రీం వ్యాఖ్యలను ఖండిస్తూ ఆదివారం ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటుచేస్తున్న రౌండ్‌టేబుల్ సమావేశానికి ప్రజాసామ్యవాదులు తరలి రావాలని విజ్ఞప్తిచేశారు. రామకృష్ణ, రాజు, ఆది, వెంకటేసులు, నారాయణస్వామి, గోపాల్ పాల్గొన్నారు.

## ప్రాథమికోన్నత పాఠశాలను అప్‌గ్రేడ్ చేయండి

బుక్కరాయసముద్రం, ఫిబ్రవరి 1(ఆంధ్రజ్యోతి): మండలంలోని జంతులూరు ప్రాథమికోన్నత పాఠశాలను తొలిగించకుండా జడ్పీ పాఠశాలగా అప్‌గ్రేడ్ చేయాలని ఎంఈఓ నవీదాకు ఆ గ్రామ ప్రజలు విన్నవించారు. ప్రస్తుతం రాష్ట్ర ప్రభుత్వం 117 జీవో ఆధారంగా జంతులూరు గ్రామంలోని ప్రాథమికోన్నత పాఠశాలను తొలిగించడం వల్ల విద్యార్థులకు తీవ్ర ఇబ్బందులు ఎదురువుతాయన్నారు. పాఠశాలలో 60 మంది విద్యార్థులకు పైగా చదువుతున్నారన్నారు. పాఠశాలను ఉన్నత పాఠశాలగా అప్‌గ్రేడ్ చేస్తే జంతులూరు, నీలంపల్లి, చెదల్ల, గోవిందంపల్లి, భద్రంపల్లి గ్రామాలకు చెందిన విద్యార్థులకు అనుకూలంగా ఉంటుందని, 120 మందిపైగా పాఠశాలకు వస్తారని ప్రజలు ఎంఈఓకు విన్నవించారు.

## డయాలసిస్ బాధితుడికి పింఛన్ అందజేత

రాప్తాడు, ఫిబ్రవరి 1 (ఆంధ్రజ్యోతి): రాప్తాడు గ్రామానికి చెందిన మోకే వీరభద్ర కొంత కాలంగా డయాలసిస్ వ్యాధితో బాధపడుతున్నాడు. ఎమ్మెల్యే పరిటాల సునీత ప్రత్యేక చొరవతో వీరభద్రకు నూతన పింఛన్ రూ.10 వేలు మంజూరు అయ్యింది. ఆమేరకు టీడీపీ నాయకులు శనివారం వీరభద్ర ఇంటికి వెళ్లి పింఛన్ సొమ్మును అందచేశారు. మండల కన్వీనర్ కొండప్ప, సర్పంచ్ సాకే తిరుపాలు, ఫీల్డ్ అసిస్టెంట్ శివ పాల్గొన్నారు.

## దరఖాస్తుల ఆహ్వానం

అనంతపురం ప్రెస్‌క్లబ్, ఫిబ్రవరి 1 (ఆంధ్రజ్యోతి): కదిరిలో ఉన్న తనకల్లు గిరిజన గురుకుల బాలికల కళాశాలలో ఇంటర్మీడియట్ ప్రవేశాలకు గిరిజన విద్యార్థులు మాత్రమే దరఖాస్తులు చేసుకోవాలని కళాశాల ప్రిన్సిపాల్ వెంకట రామానాయుడు తెలిపారు. ఈ మేరకు శనివారం విడుదల చేసిన ప్రకటనలో ఆయన స్పష్టం చేశారు. ఇంగ్లీష్, తెలుగు మీడియంలలో చదివిన బాలికలు 3వ తేదీ నుంచి మార్చి 2వ తేదీ వరకూ ఆన్‌లైన్ దరఖాస్తులు చేసుకోవాలన్నారు. మార్చి 9వ తేదీ ఉదయం 10.30 గంటలకు కదిరిలోని గిరిజన బాలికల పాఠశాల, అనంత జిల్లాలోని గొల్లలదొడ్డి గిరిజన బాలికల పాఠశాలలో ప్రవేశ పరీక్ష నిర్వహిస్తారన్నారు. విద్యార్థినులు //http://twreiscet.apcfss.in/ వెబ్‌సైట్‌లో దరఖాస్తులు చేసుకోవాలన్నారు.

## డీజీపీని కలిసిన ఎస్పీ


డీజీపీకి శుభాకాంక్షలు తెలుపుతున్న ఎస్పీ

అనంతపురం క్రైం,ఫిబ్రవరి 1(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర డీజీపీగా బాధ్యతలు స్వీకరించిన హరీష్‌కుమార్ గుప్తాను ఎస్పీ జగదీష్ కలిశారు. శనివారం మంగళగిరి పోలీస్ ప్రధాన కార్యాలయంలో ఎస్పీ డీజీపీని కలిసి మొక్కను అందజేశారు. నూతన డీజీపీకి శుభాకాంక్షలు తెలిపారు.

## చెస్‌లో జిల్లా క్రీడాకారుల ప్రతిభ

అనంతపురం క్లాక్‌టవర్, ఫిబ్రవరి 1 (ఆంధ్రజ్యోతి): జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో ఉత్తమ ర్యాంకులు సాధించిన చెస్ జిల్లా క్రీడాకారులు ప్రత్యేక గుర్తింపు సాధించారు. ప్రపంచ చదరంగ సమాఖ్య అఖిల భారత చదరంగ సమాఖ్యలు సంయుక్తంగా శనివారం విడుదల చేసిన చెస్ క్రీడాకారుల జాబితాలో మెరుగైన స్థానాలను సొంతం చేసుకున్నారు. జిల్లా నుంచి సంజయ్‌సాహల్ 1401 ర్యాంకులో నిలవగా, త్రిపద 1427 ర్యాంకును దక్కించుకున్నారు. ఆల్ అనంతపూర్ చెస్ అసోసియేషన్ అధ్యక్షుడు శివకుమార్, గౌరవాధ్యక్షుడు బాలరాజు, కోశాధికారి కిశోర్‌కుమార్, ఇంటర్నేషనల్ ఆర్బిటార్ ఉదయ్‌కుమార్ నాయుడు క్రీడాకారులను అభినందించారు.

## ఖజానాశాఖ ఇన్‌చార్జి డీడీగా వెంకటేశ్వర్లు

అనంతపురం టౌన్, ఫిబ్రవరి 1 (ఆంధ్రజ్యోతి): జిల్లా ఖజానాశాఖ ఇన్‌చార్జి డిప్యూటీ డైరెక్టర్‌గా వెంకటేశ్వర్లు శనివారం బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ డీడీగా పనిచేస్తున్న సరళా విజయకుమారి శుక్రవారం పదవీవిరమణ పొందిన విషయం తెలిసిందే. కడప జిల్లా డీడీ వెంకటేశ్వర్లుకు ఇన్‌చార్జిగా బాధ్యతలు అప్పగిస్తూ రాష్ట్ర శాఖ ఉత్తర్వులు జారీ చేసింది. దీంతో వెంకటేశ్వర్లు శనివారం జిల్లాకు వచ్చి ఖజానాశాఖ ఇన్‌చార్జి డీడీగా బాధ్యతలు చేపట్టారు. పలువురు అధికారులు, ఉద్యోగులు డీడీకి పుష్పగుచ్ఛాలు అందించి శుభాకాంక్షలు తెలిపారు.

## అలుపెరగని పోరాటయోధుడు మందకృష్ణ మాదిగ

గార్లదిన్నె, ఫిబ్రవరి 1(ఆంధ్రజ్యోతి): మాదిగల ఉనికి చాటేందుకు మందకృష్ణ మాదిగ అలుపెరగని పోరాటలు చేశారని ఎమార్పీఎస్ నాయకుడు కదిరప్ప అన్నారు. మందకృష్ణ మాదిగకు కేంద్ర ప్రభుత్వం పద్మశ్రీ అవార్డు ప్రకటించడంతో శనివారం ఎమ్మార్పీఎస్, బీజేపీ, టీడీపీ నాయకులు, దళిత సంఘాల నాయకులు గార్లదిన్నెలో అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళి అర్పించారు. అనంతరం కేక్ కట్‌చేసి మందకృష్ణ మాదిగ చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. కదిరప్ప, మిట్టా రాజా, రాజుకుళ్యాయ్యప్ప, నాగరాజు, పుల్లన్న, ప్రసాద్, ఆదేన్న, బాలరాజు, తిక్కన్న, ఆంజనేయులు పాల్గొన్నారు.

## ఎరువులు నాణ్యతగా ఉండాలి

శింగనమల, ఫిబ్రవరి 1 (ఆంధ్రజ్యోతి): ఎరువులు నాణ్యతగా ఉండాలని జిల్లా వ్యవసాయధికారి ఉమామహేశ్వరమ్మ ఎరువుల తయారీదారులను ఆదేశించారు. శనివారం మండలంలోని సి.బండమీదపల్లి స్వర్ణ భూమి ఫర్టిలైజర్ ఎరువుల తయారీ కేంద్రాన్ని ఆమె తనిఖీ చేశారు. కేంద్రంలోని లైసెన్స్ రామెటీరియల్ రిజిస్టర్, ల్యాబ్, మిషనరీ గోడౌన్‌ని పరిశీలించారు. అమె మాట్లాడుతూ ఎరువుల తయారీకి సంబంధించి ప్రతి నెల స్టాక్ రిపోర్ట్ తప్పకుండా ఉన్నతాధికారులకు పంపాలన్నారు. ఏఓలు అన్వేష్ కూమార్, బాలా నాయక్ పాల్గొన్నారు.

## ఉపాధిని కోల్పోతున్నాం.. ఆదుకోండి

చెన్నేకొత్తపల్లి, ఫిబ్రవరి 1(ఆంధ్రజ్యోతి): రైల్వే బ్రిడ్జి నిర్మాణంతో తమకు ఉపాధి మార్గమైన దుకాణాలతో పాటు నివాసాలు కోల్పోతున్నామని, ఆదుకోవాలని మండలంలోని ఎన్‌ఎస్‌గేటు గ్రామస్థులు శనివారం తహసీల్దార్ సురేశ్‌కుమార్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. ఎన్నో ఏళ్లుగా గ్రామ ప్రధాన కూడలిలో దుకాణాలను ఏర్పాటుచేసుకుని జీవనం సాగిస్తున్నామన్నారు. రైల్వే వంతెన నిర్మాణం చేపడుతుండటంతో 10 రోజుల్లో దుకాణాలతో పాటు నివాసాలు ఖాళీ చేయాలని అధికారులు నోటీసులు జారీ చేశారన్నారు. తహసీల్దార్ స్పందిస్తూ 15రోజుల పాటు సమయం తీసుకుని దుకాణాలను తొలగించుకోవాలన్నారు.

## ఐటీఐ టెక్ కార్నర్ ఏర్పాటు

అనంతపురం సెంట్రల్, ఫిబ్రవరి 1(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ ఐటీఐ టెక్ కార్నర్ కేంద్రాన్ని ఏర్పాటుచేశారు. శనివారం కళాశాల ప్రిన్సిపాల్ రామమూర్తి కేంద్రాన్ని ప్రారంభించి మాట్లాడారు. విద్యార్థులకు ప్రాక్టికల్‌గా ఆధునిక టెక్నాలజీ విద్యనందించేందుకు రూ.40లక్షల వ్యయంతో అధునాతన కేంద్రాన్ని చేశామ్నారు. అధ్యాపకులు ఇషాక్‌బాషా, కృష్ణ ప్రసాద్ పాల్గొన్నారు.

## 7న చలో హైదరాబాద్

అనంతపురం విద్య, ఫిబ్రవరి 1(ఆంధ్రజ్యోతి): ఎస్సీ వర్గీకరణ అమలు కోసం 7వ తేదీన చలో హైదరాబాద్ నిర్వహించనున్నట్లు ఎంఈఎఫ్ జాతీయ అదనపు ప్రధానకార్యదర్శి బండారు శంకర్ తెలిపారు. శనివారం ఉపాధ్యాయభవన్‌లో ఎమ్మార్పీఎస్, ఎంఈఎఫ్ ఆధ్వర్యంలో "వేల గొంతులు- లక్షల డప్పులు" కార్యక్రమ పోస్టర్లను ఆవిష్కరించారు. గంగాధర్, అమర్‌నాథ్, కదిరప్ప, చంద్ర, నాగభూషణం, రమేష్, శీనా, బూదెప్ప పాల్గొన్నారు.

# ఫైనల్‌కు చేరిన ఏపీ, తమిళనాడు జట్లు

అనంతపురం క్లాక్‌టవర్, ఫిబ్రవరి 1(ఆంధ్రజ్యోతి): సౌత్‌జోన్ వెటరన్స్ క్రికెట్ పోటీల్లో ఆంధ్రప్రదేశ్, తమిళనాడు జట్లు ఫైనల్‌కు చేరాయి. శనివారం ఆర్డీటీ స్టేడియంలో ఆర్‌వీకే మెమోరియల్ సౌత్‌జోన్ వెటరన్ క్రికెట్ పోటీలు మూడో రోజు కొనసాగాయి. మొదటి మ్యాచ్‌లో హైదరాబాద్, సర్వీసెస్ జట్లు తలపడగా...మొదట బ్యాటింగ్ చేసిన సర్వీసెస్ జట్టు నిర్ణీత 20ఓవర్లలో 5వికెట్లు కోల్పోయి 135పరుగులు చేసింది. అనంతరం బరిలోకి దిగిన హైదరాబాద్ జట్టు 19.5 ఓవర్లలో 8వికెట్లు కోల్పోయి 141పరుగులు చేసి 2వికెట్ల తేడాతో విజయాన్ని నమోదు చేసింది. 34పరుగులు, వికెట్ తీసి జట్టు విజయంలో కీలకపాత్రపోషించిన సాయినాథ్‌చారి మ్యాన్‌ఆఫ్ ది మ్యాచ్ అవార్డు అందుకున్నారు. మరో మ్యాచ్‌లో తమిళనాడు, ఆంధ్రప్రదేశ్ జట్లు తలపడగా మొదట బ్యాటింగ్ చేసిన ఆంధ్రప్రదేశ్ నిర్ణీత 20ఓవర్లలో 4వికెట్లు కోల్పోయి 189పరుగులు చేసింది. ఇందులో మనోజ్‌సాయి సెంచరీ సాధించారు. అనంతరం బరిలోకి దిగిన తమిళనాడు జట్టు 19.5ఓవర్లలో 6వికెట్లు కోల్పోయి 190పరుగులు చేసింది. ఎస్‌పీ నాథన్ 73పరుగులు చేసి తమిళనాడు జట్టును 4వికెట్ల తేడాతో గెలిపించి ప్లేయర్ ఆఫ్‌ది మ్యాచ్ అవార్డు అందుకున్నారు. దీంతో వరుసగా చెరో మూడు మ్యాచ్‌లు గెలిచిన ఆంధ్రప్రదేశ్, తమిళనాడు జట్లు ఆదివారం ఫైనల్‌లో తలపడనున్నాయి. కార్యక్రమంలోజిల్లా క్రికెట్ సంఘం ఇన్‌చార్జి సెక్రటరీ భీమలింగారెడ్డి, ఆంధ్రా క్రికెట్ అసోసియేషన్ జనరల్ మేనేజర్ ఎంఎస్ కుమార్, అపెక్స్ మెంబర్ ప్రసన్నకుమార్, ఏసీఏ సౌత్‌జోన్ మేనేజర్ సాగర్‌చౌదరి, జిల్లా వెటరన్ క్రికెట్ డైరెక్టర్ నాగప్ప, అధ్యక్షుడు కృష్ణమోహన్, సెక్రటరీ మధుకర్, ఆర్డీటీ స్పోర్ట్స్ డైరెక్టర్ సాయికృష్ణ, వెటరన్ క్రీడాకారులు పాల్గొన్నారు.


సెంచరీ సాధించిన మనోజ్‌సాయి

న్యూస్ బాక్స్

## నేడు 'అనంతపురం కోసం పరుగు'

అనంతపురం క్లాక్‌టవర్, ఫిబ్రవరి 1(ఆంధ్రజ్యోతి): సే నో టూ డ్రగ్స్ నినాదంతో అనంతపురం కోసం పరుగు కార్యక్రమాన్ని శాప్, ఈగల్, అహుడా, ఆర్ట్స్ కళాశాల ఎన్‌ఎస్‌ఎస్ యూనిట్లు సంయుక్తంగా ఆదివారం వీ రన్ నిర్వహించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. శనివారం స్థానిక ప్రెస్‌క్లబ్‌లో శాప్-ఈగల్ సే నో టూ డ్రగ్స్ పోస్టర్లను సభ్యులు విడుదల చేశారు. వీ వైబ్ సంస్థ అధినేత సజ్జ రాఘవీణ, ఆర్ట్స్ కళాశాల ఎన్‌ఎస్‌ఎస్ అధికారి డాక్టర్ సుధాకర్, ఎస్‌వీ యూనివర్శిటీ ఎన్‌ఎస్‌ఎస్ కోఆర్డినేటర్ హరికృష్ణ మాట్లాడుతూ శాప్, ఎలైట్ యాంటీనార్కోటిక్స్ గ్రూప్ ఫర్ లా ఎంపవర్‌మెంట్-ఈగల్, అహుడా, ఆర్ట్స్ కళాశాల ఎన్‌ఎస్‌ఎస్ యూనిట్లు సంయుక్త ఆధ్వర్యంలో వీ వైబ్ సంస్థ నిర్వహించే అనంతపురం కోసం పరుగు (వీ రన్ ఫర్ అనంతపురం) సే నో టూ డ్రగ్స్ అనే నినాదంతో కొనసాగుతుందన్నారు. ఆదివారం ఉదయం 6గంటలకు కలెక్టరేట్ నుంచి 10కె, 5కె, 3కె రన్ ఉంటుందన్నారు. ముఖ్య అతిథులుగా శాప్ చైర్మన్ రవినాయుడు, ఎంపీ అంబికా లక్ష్మీనారాయణ, ఈగల్ ఎస్పీ నగేష్, ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్, అహుడా చైర్మన్ టీసీ వరుణ్, కలెక్టర్ వినోద్‌కుమార్, ఎస్పీ జగదీష్ పాల్గొంటారన్నారు.

## 'అశోక్ పడపాటి'కి అవార్డు


అశోక్ పడపాటిని సత్కరిస్తున్న ప్రతినిధులు

అనంతపురం ప్రెస్‌క్లబ్, ఫిబ్రవరి 1(ఆంధ్రజ్యోతి): వదాన్య జన సొసైటీ ద్వారా పేద విద్యార్థులకు విద్యపరంగా సహాయ సహకారాలు అందిస్తున్న సంస్థ ఫౌండర్ అశోక్ పడపాటికి యువత భారత్ గౌరవ్ సమ్మాన్ అవార్డు దక్కింది. ఈ మేరకు శనివారం బెంగళూరులోని గోవిందాచార్య స్థాపించిన భారత వికాస సంఘం 7వ భారతీయ సంస్కృతి ఉత్సవాలలో వివిధ సామాజిక సేవా రంగాల్లో ప్రతిభ చాటిన సామాజికసేవా కార్యకర్తలకు సత్కరించారు. అందులో భాగంగా అశోక్ పడపాటికి అవార్డును అందజేసి సత్కరించారు. ప్రధాన సమన్వయకర్త బసవరాజ్ పాటిల్, మాజీ ఎంపీ, రిటైర్డ్ మేజర్ జనరల్ ప్రమోద్ సెహగల్, వందేమాతరం ఫౌండేషన్ మాధవ్ రెడ్డి, సీజీఆర్ అధిపతి లీలా లక్ష్మారెడ్డి పాల్గొన్నారు.

## నైతిక, మానవతా విలువల పరీక్షకు 799 గైర్హాజరు

అనంతపురం విద్య, ఫిబ్రవరి 1(ఆంధ్రజ్యోతి): జిల్లా వ్యాప్తంగా 146 జూనియర్ కళాశాల్లో శనివారం నిర్వహించిన నైతిక, మానవతా విలువల పరీక్షకు 799 గైర్హాజరైనట్లు జిల్లా వృత్తివిద్యాశాఖాధికారి(డీవీఈఓ), జిల్లాపరీక్షల నిర్వహణ కన్వీనర్ వెంకటరమణ నాయక్ పేర్కొన్నారు. 26274 మందికిగాను 25475 మంది విద్యార్థులు హాజరుకాగా 799 మంది గైర్హాజరైనట్లు తెలిపారు.

## కేంద్ర బడ్జెట్‌పై ఎవరేమన్నారు..?

### రాష్ట్రానికి మేలే జరిగింది..



కేంద్ర బడ్జెట్‌లో రాష్ట్రానికి మేలే జరిగింది. అన్ని వర్గాలకు న్యాయం జరిగే విధంగా బడ్జెట్‌లో నిధులు కేటాయించారు. ముఖ్యంగా మధ్య తరగతి ప్రజలు, ఉద్యోగవర్గాలకు పన్ను మినహాయింపుతో ప్రయోజనం చేకూరింది. పోలవరం, విశాఖ ఉక్కు పరిశ్రమకు బడ్జెట్‌లో నిధులు కేటాయించడం శుభపరిణామం. సూక్ష్మ, చిన్న, మధ్య తరహా పరిశ్రమలకు బడ్జెట్‌లో ప్రోత్సాహకాలు, రైతులకు కిసాన్ క్రెడిట్ కార్డు ద్వారా రుణాల పరిమితి పెంపుతో ఆ వర్గాలకు ప్రయోజనం చేకూరింది. రాష్ట్రంలో ఎన్డీఏ కూటమి ప్రభుత్వ పెద్దల చొరవతో రాష్ట్రానికి మేలే జరిగింది.

**- భవానీ రవికుమార్, జనసేన కార్యక్రమల నిర్వహణ రాష్ట్ర ప్రధానకార్యదర్శి**

### ప్రగతిశీల బడ్జెట్...



ప్రజల జీవన ప్రమాణాలు పెంపొందించేలా ప్రధాని నరేంద్రమోదీ, ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ ప్రగతిశీల బడ్జెట్‌ను ప్రవేశపెట్టారు. రైతు సంక్షేమానికి ప్రాధాన్యమిస్తూ దేశ ఆర్థిక వ్యవస్థకు వెన్నెముకలాంటి మధ్యతరగతి ప్రజలకు పన్ను మినహాయింపునిచ్చారు. పరిశ్రమలు, ఐటీ, వ్యవసాయం తదితర రంగాలకు పెద్దమొత్తంలో నిధులు కేటాయించారు. ఎంబీబీఎస్ సీట్లను పెంచి ప్రజలకు మెరుగైన వైద్యం అందించేందుకు ప్రాధాన్యమించారు.

**- సందిరెడ్డి శ్రీనివాసులు, బీజేపీ సీనియర్ నాయకులు.**

### పేదలకు ప్రయోజనం లేని బడ్జెట్



పెట్టుబడిదారులకు అందలమెక్కించే విధంగా బడ్జెట్ ఉంది. ప్రధాని మోదీ మాటల గారడీ, ఆర్థికమంత్రి అంకెల గారడీతో రాష్ట్రానికి తీరని అన్యాయం చేశారు. కార్పొరేట్ వ్యవస్థలకు అనుకూల బడ్జెట్ ఇది. పేదలకు ఏ మాత్రం ప్రయోజనం చేకూరదు. వ్యవసాయరంగాన్ని పూర్తిగా నిర్లక్ష్యం చేశారు. వ్యవసాయాన్ని నమ్ముకొని జీవిస్తున్న రైతాంగ ఆశలన్నీ ఈ బడ్జెట్‌తో ఆవిరయ్యాయి. ఎరువుల సబ్సిడీకి నిధులు కేటాయించకపోవడం, ప్రధానమంత్రి ఫసల్‌బీమాకు నిధుల్లో కోత పెట్టడం, రాయలసీమ ప్రాంతానికి ప్రత్యేక ప్యాకేజీ నిధులు ప్రస్తావించకపోవడం దారుణం.

**-దాదాగాంధీ, కాంగ్రెస్ మైనార్టీ సెల్ రాష్ట్ర అధ్యక్షుడు**

### విద్యార్థులను ప్రోత్సహించేలా...



సరికొత్త ఆలోచనలతో ఆవిష్కరణలు సృష్టించి వాటిని స్టార్టప్ రూపంలో సమాజ అవసరాలను తీర్చేలా రూపొందించిన కేంద్ర బడ్జెట్ విద్యార్థులను ప్రోత్సహించేవిధంగా ప్రాధాన్యమిచ్చారు. ఇప్పటికే పరిశ్రమల అవసరాలకు అనుగుణంగా నూతన విద్యావిధానంలో పాఠ్యాంశాలను రూపొందించాం. వాటిని ప్రాక్టికల్‌గా శిక్షణ ఇవ్వడానికి ఇంటర్న్‌షిప్‌లు చేయిస్తున్నాం. పరిశ్రమల అభివృద్ధికి బడ్జెట్‌లో ప్రత్యేక నిధులు కేటాయించిన అంశం కలసివస్తుంది.

**- రామచంద్ర, ఎస్కేయూ ఇంజనీరింగ్ కళాశాల ప్రిన్సిపాల్**

### గ్రామీణాభివృద్ధికి తోడ్పాటు



గ్రామీణాభివృద్ధికి తోడ్పాటునందించేలా వ్యవసాయ రంగం, దాని అనుబంధ సంస్థలకు రూ.1.72 లక్షల కోట్లు కేటాయించారు. ఆధునిక పద్ధతుల్లో వ్యవసాయం చేసేందుకు, కిసాన్ క్రెడిట్ కార్డు పంపిణీ చేసేందుకు నిధులు కేటాయించారు. వేరుశనగ, నువ్వులు, ఆముదాలు వంటి నూనెగింజల పంటలను ప్రోత్సహించేందుకు బడ్జెట్‌లో చోటుకల్పించారు. చేపలు, రొయ్యలు విదేశీలకు ఎగుమతికి. పాడిపరిశ్రమ, కోళ్ల, గొర్రెల ఫార్మింగ్‌కు ఇవన్నీ గ్రామీణాభివృద్ధికి దోహదపడుతాయి. అనంతపురం జిల్లాభివృద్ధికి చోటుకల్పించడం విశేషం.

**-ప్రొఫెసర్ మునినారాయణప్ప, ఎస్కేయూ రూరల్ డెవలప్‌మెంట్ విభాగాధిపతి**


బ్రహ్మంగారి గుడి వద్ద నారాలోకేశ్ కటౌట్‌కు క్షీరాభిషేకం చేస్తున్న ఎమ్మెల్యే

## అరచేతిలో అందుబాటులోకి 161 సేవలు

● ఎమ్మెల్యే దగ్గుపాటి వెంకటేశ్వర ప్రసాద్

అనంతపురం అర్బన్, ఫిబ్రవరి 1(ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వంలో అరచేతిలోనే 161 సేవలు అందుబాటులోకి తెచ్చామని ఎమ్మెల్యే దగ్గుపాటి వెంకటేశ్వరప్రసాద్ అన్నారు. శనివారం స్థానిక పాతూరు బ్రహ్మంగారి ఆలయం వద్ద పద్మశాలి కార్పొరేషన్ రాష్ట్ర డైరెక్టర్ పోతుల లక్ష్మీనరసింహులు ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన నారాలోకేశ్ భారీ కటౌట్‌కు ఎమ్మెల్యే క్షీరాభిషేకం చేశారు. రాణి నగర్‌లో స్థానిక నాయకుల ఆధ్వర్యంలో లోకేశ్ చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. రాయల్ మురళీ, పోతుల లక్ష్మీనరసింహులు, కుంచెపు వెంకటేష్, గుర్రం నాగభూషణం, పరమేశ్వరన్, కడియాల కొండన్న పాల్గొన్నారు.

**మహిళలు స్వయం ఉపాధి వైపు అడుగులు వేయాలి**

మహిళలు స్వయం ఉపాధి దిశగా అడుగులు వేయాలని ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ అన్నారు. మండలంలోని రుద్రంపేట పంచాయతీలో గ్రామ సంఘం కార్యాలయంలో రూడ్ సెట్ ఆధ్వర్యంలో మహిళలకు జూట్ బ్యాగుల తయారీపై శిక్షణ కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. కార్యక్రమానికి ఎమ్మెల్యే హాజరై ప్రారంభించారు. ఎంపీడీఓ దివాకర్, ఈఓఆర్డీవెంకటనాయుడు, పంచాయితీ కార్యదర్శి హిదయతుల్లా, ఏరియా కో ఆర్డినేటర్ సుభద్ర పాల్గొన్నారు.

**ఇచ్చిన హామీలు నెరవేర్చే ప్రభుత్వం మాది:** ఇచ్చిన హామీలు నెరవేర్చే ప్రభుత్వం తమదని ఎమ్మెల్యే దగ్గుపాటి వెంకటేశ్వరప్రసాద్ అన్నారు. శనివారం స్థానిక రాణి నగర్, రహ్మత్ నగర్‌లలో పలువురికి ఎమ్మెల్యే పింఛన్ సొమ్మును అందజేశారు. నగరపాలక కమిషనర్ మల్లికార్జునరెడ్డి, సచివాలయ సిబ్బంది, టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

**పింఛన్లు పంపిణీ** అనంతపురంరూరల్ మండలంలోని అనంతపురం రూరల్ పంచాయతీ టీవీ టవర్, ఎన్టీఆర్ కాలనీల్లో ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ లబ్ధిదారులకు శనివారం లబ్ధిదారులకు పింఛన్లు పంపిణీ చేశారు. మండల ప్రత్యేక అధికారి మునిప్రసాద్, ఎంపీడీఓ దివాకర్, ఈఓఆర్డీ వెంకటనాయుడు, పంచాయతీ కార్యదర్శి శ్రీధర్‌రావు, సర్పంచు ఉదయ్‌శంకర్, టీడీపీ జయరాంనాయుడు పాల్గొన్నారు.

## శాప్ చైర్మన్‌ను కలిసిన ఎంఎస్ రాజు


శాప్ చైర్మన్ రవినాయుడుకు బొకే అందిస్తున్న ఎమ్మెల్యే ఎంఎస్ రాజు

అనంతపురం క్లాక్‌టవర్, ఫిబ్రవరి 1 (ఆంధ్రజ్యోతి): జిల్లాకు వచ్చిన శాప్ చైర్మన్ అనిమిని రవినాయుడును మడకశిర ఎమ్మెల్యే, టీటీడీ సభ్యులు ఎంఎస్ రాజు శనివారం సాయంత్రం స్థానిక ఆర్‌అండ్‌బీ అతిథిగృహంలో మర్యాదపూర్వకంగా కలిశారు. ఆయనతో పాటు కాపు కార్పొరేషన్ మాజీ డైరెక్టర్ రాయల్‌మురళీ కలిశారు. పరస్పరం పుష్పగుచ్ఛాలు, శాలువాలతో సత్కరించుకున్నారు. టీడీపీ నాయకులు, తెలుగుయువత, క్రీడాసంఘాల నాయకులు శాప్‌చైర్మన్‌కు స్వాగతం పలికారు.

## ఉచిత గుండె పరీక్షలు

అనంతపురం క్లాక్‌టవర్, ఫిబ్రవరి 1 (ఆంధ్రజ్యోతి): రోటరీక్లబ్ ఆధ్వర్యంలో శనివారం స్థానిక అనంతపూర్ క్లబ్‌లో ఉచిత గుండె వైద్య పరీక్షలు నిర్వహించారు. రోటరీక్లబ్, ఇన్నర్‌వీల్ క్లబ్ సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహించిన గుండె పరీక్షలలో ఈసీజీ, 2డి ఎకో పరీక్షలు నిర్వహించారు. సవేరా ఆసుపత్రి వైద్యులు పరీక్షలు చేశారు. రోటరీక్లబ్ అనంతపూర్ సెంట్రల్ అధ్యక్ష, కార్యదర్శులు భవాని రవికుమార్, గల్లా హర్ష, సభ్యులు కేశవరెడ్డి, మేడా అరవింద్‌కుమార్, తైక్వాండో శాంతరాజ్, విశ్రాంత వార్డెన్ శ్రీనివాస్‌రెడ్డి, మల్లారెడ్డి, శ్వేతారెడ్డి, మేడా రామలక్ష్మి, జయంతి పాల్గొన్నారు.

## వడ్డే ఓబన్న విగ్రహావిష్కరణకు తరలిరండి

రామగిరి, ఫిబ్రవరి 1(ఆంధ్రజ్యోతి): స్వాతంత్ర్య సమరయోధుడు వడ్డే ఓబన్న విగ్రహావిష్కరణ మండలంలోని పేరూరు గ్రామంలో ఆదివారం నిర్వహిస్తున్నట్లు వడ్డెర సంఘం నాయకులు తెలిపారు. కార్యక్రమానికి ఎమ్మెల్యే పరిటాలసునీత, ధర్మవరంటీడీపీ ఇన్‌చార్జ్ పరిటాల శ్రీరామ్ హాజరవుతారన్నారు. కార్యక్రమానికి మండలంలోని వడ్డెర్లు, టీడీపీ నాయకులుఊ హాజరై జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు.

## గొడవ సరే.. గాయాలైనా కేసులు కట్టని పోలీసులు

● ఎస్పీకి విన్నవించినా దిక్కులేదు


గాయపడిన లక్ష్మీదేవి

అనంతపురం క్రైం, ఫిబ్రవరి 1 (ఆంధ్రజ్యోతి): నగరంలోని అశోక్‌నగర్‌లో స్థలం విషయంలో రెండు కుటుంబాల మధ్య వివాదం కొన్ని నెలలుగా జరుగుతూనే ఉన్నాయి. ఈ విషయంలో వన్‌టౌన్ పోలీసులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోలేదు. గత నెల 27వతేదీన ఎస్పీ కార్యాలయంలో ప్రజా సమస్యల పరిష్కారంలో ఫిర్యాదుల పరిష్కార వేదికలో తాజాగా రమాదేవి తన భర్త రామాంజనేయులు దివ్యాంగుడని, కానీ తమను దూషిస్తున్నారని, వారితో ప్రాణహాని ఉందని ఫిర్యాదు చేసింది. కానీ వన్‌టౌన్ పోలీసులు పట్టించుకోలేదు. రామాంజనేయులు, కొండారెడ్డిల మధ్య శుక్రవారం మరోసారి గొడవ జరిగింది. ఘర్షణలో రామాంజనేయులు తరపున లక్ష్మీదేవి, రమాదేవిలకు గాయాలయ్యాయి. కొండారెడ్డి తరపున సాహెబీకి గాయమైంది. చికిత్స నిమిత్తం వారిని ప్రభుత్వాసుపత్రికి తరలించారు. ఎమ్మెల్సీ అయినప్పటికీ పోలీసులు తూతూమంత్రంగా వచ్చి వివరాలు రాసుకెళ్లినట్లు తెలిసింది. ఈ విషయంలో వన్‌టౌన్ ఎస్ఐ ఒకరు పంచాయతీ చేస్తున్నట్లు సమాచారం. గతంలోనూ ఆయన పలు సార్లు ఇరువర్గాలతో మాట్లాడినా సమస్య సద్దుమణగలేదు. ఇప్పుడు ఆయన ప్రత్యేకంగా చూస్తున్నారేమో. శనివారం రాత్రయినా కేసు నమోదు చేయకపోవడం గమనార్హం.

## వ్యక్తిపై కేసు నమోదు

అనంతపురం క్రైం,ఫిబ్రవరి1 (ఆంధ్రజ్యోతి): ఓ మహిళకు అసభ్యంగా సైగలు చేసిన వ్యక్తిపై వన్‌టౌన్ పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదైంది. నగరంలోని హౌసింగ్‌బోర్డులో ఉషోదయ రోహిణి మెడికల్‌షాపుకు తరచూ బుల్లే జనార్దన్ అనే వ్యక్తి వచ్చేవాడు. సమీపంలోని ఓ మహిళతో అసభ్యంగా సైగలు చేసేవాడు. శనివారం ఆ మహిళ వన్‌టౌన్ పోలీసులకు ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేశారు.

## బాస్కెట్‌బాల్ పోటీల్లో జిల్లాకు ద్వితీయ స్థానం

అనంతపురం క్లాక్‌టవర్, ఫిబ్రవరి 1(ఆంధ్రజ్యోతి): రాష్ట్రస్థాయి బాస్కెట్‌బాల్ పోటీల్లో జిల్లాకు ద్వితీయ స్థానం దక్కింది. మూడు రోజుల పాటు విజయవాడలో నిర్వహించిన మొదటి ఏపీ అండర్-23 పురుషులు, మహిళల బాస్కెట్‌బాల్ చాంపియన్‌షిప్ పోటీలకు 13 జిల్లాల జట్లు ప్రాతినిధ్యం వహించాయి. ఇందులో ఫైనల్ పోటీల్లో చిత్తూరుపై 8పాయింట్ల తేడాతో ఓడిపోయిన జిల్లా జట్టు రన్నరప్‌గా నిలిచింది. రాష్ట్రహైకోర్టు జడ్జి జస్టిస్ సురేశ్‌రెడ్డి, బాస్కెట్‌బాల్ అసోసియేషన్ అధ్యక్షుడు చెంగల్రాయనాయుడు చేతుల మీదుగా బహుమతులు అందుకుంది. రన్నరప్‌గా నిలిచిన జిల్లా జట్టుకు సంఘం అధ్యక్ష, కార్యదర్శులు శ్రీకాంత్‌రెడ్డి, నరేంద్రచౌదరి అభినందనలు తెలిపారు.


రాష్ట్రస్థాయి బాస్కెట్‌బాల్ పోటీల్లో ద్వితీయ స్థానంలో నిలిచిన జిల్లా జట్టు

## సంక్షిప్త వార్తలు

### నెట్టికంటికి వెండి రథ ప్రాకారోత్సవం



ప్రాకారోత్సవంలో పాల్గొన్న భక్తులు

గుంతకల్లు, ఫిబ్రవరి 1(ఆంధ్రజ్యోతి): కసాపురం దేవస్థానంలో శనివారం రాత్రి స్వామివార్లకు వెండి రథంలో ప్రాకారోత్సవాన్ని నిర్వహించారు. అర్చకులు, వేదపండితులు సీతారామ లక్ష్మణ సమేత ఆంజనేయ స్వామి ఉత్సవ విగ్రహాలను అలంకరించి వెండి రథంపై కొలువుదీర్చి వైభవోపేతంగా ప్రాకారోత్సవాన్ని నిర్వహించారు. పూర్వాభాద్రా నక్షత్ర సంక్రమణం సందర్భంగా ఉదయం ఆలయంలోని యాగశాలలో ఆంజనేయ స్వామి విగ్రహానికి తిరుమంజన స్నపనం, మన్యుసూక్త హోమం నిర్వహించారు. కార్యక్రమాలలో ఆలయ ఈఓ వాణి, ఏఈఓ ఓంకారం వెంకటేశ్వరుడు, సూపరింటెండెంట్ పిడికిటి ఆంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

### సబ్సిడీ రుణాల కోసం దరఖాస్తు చేసుకోండి

గుత్తి, ఫిబ్రవరి 1(ఆంధ్రజ్యోతి): స్వయం ఉపాధి కోసం వివిధ కార్పొరేషన్ల కింద మంజూరయ్యే రాయితీతో కూడిన రుణాల కొరకు ఆసక్తి గల వారు దరఖాస్తు చేసుకోవాలని మున్సిపల్ కమిషనర్ జబ్బర్‌మియా తెలిపారు. మున్సిపల్ పరిధిలో 54 యూనిట్లు మంజూరయ్యాయన్నారు. వీటిలో బీసీలకు-38, ఈబీసీకి-3, కమ్మకు-2, కాపునకు-9, రెడ్డికి-1, ఆర్యవైశ్యులకు-1 చొప్పున మంజూరయ్యాయన్నారు. 21నుంచి60 ఏళ్లలోపు వారు కుల ధృవీకరణ, రేషన్‌కార్డు, ఆధార్‌కార్డు, బ్యాంక్ ఖాతా వివరాలతో ఆన్‌లైన్‌లో ఈనెల 7తేదీలోపు దరఖాస్తు చేసుకోవాలని ఆయన సూచించారు.

### కేజీబీవీకి కుట్టుమిషన్ల వితరణ

కుందుర్పి, ఫిబ్రవరి 1(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని కేజీబీవీకి స్థానిక సమాజ క్రాంతి ఛారిటబుల్ ట్రస్టు వారు శనివారం నాలుగు కుట్టుమిషన్లను వితరణ చేశారు. ఇందుకు ప్రిన్సిపాల్ నిర్మల ట్రస్టుకు కృతజ్ఞతలు తెలిపారు. ట్రస్టు కోఆర్డినేటర్లు రఘువీరా, శ్రీకాంత్, ఉపాధ్యాయినులు పాల్గొన్నారు.

### కమ్యూనిటీ భవనం కోసం వినతి

కళ్యాణదుర్గంరూరల్, ఫిబ్రవరి 1(ఆంధ్రజ్యోతి): పట్టణంలో వికలాంగులకు కమ్యూనిటీ భవనం మంజూరు చేయాలని ఎమ్మెల్యే అమిలినేని సురేంద్రబాబును వికలాంగుల సంక్షేమ సంఘం నాయకులు కోరారు. ఎమ్మెల్యేను శనివారం వారు స్థానిక కార్యాలయంలో కలిసి ఈ మేరకు వినతిపత్రం అందజేశారు. స్పందించిన ఎమ్మెల్యే ఆర్డీవో వసంతబాబుతో మాట్లాడి వికలాంగుల కమ్యూనిటీ భవనం కోసం స్థలం కేటాయించాలని సూచించారు. వికలాంగుల సంక్షేమ సంఘం నాయకులు ఉద్దీప్ సింహ, పాతలింగ, దాసరి బాలకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

### మట్టి తరలింపుపై ఇంటెలిజెన్స్ అధికారుల ఆరా

ఆంధ్రజ్యోతి స్పందన

పుట్లూరు, ఫిబ్రవరి 1(ఆంధ్రజ్యోతి): మండలంలో కొనసాగుతున్న మట్టి అక్రమ తరలింపుపై శనివారం ఆంధ్రజ్యోతిలో కొండనుకొట్టి.. మట్టిని పట్టి అనే శీర్షికన కథనం ప్రచురితమైంది. ఇందుకు స్పందించిన ఇంటిలిజెన్స్ అధికారులు ఎక్కడెక్కడ కొండమట్టిని అక్రమంగా తరలిస్తున్నారని ఆరా తీశారు. ఈ మేరకు మండలంలోని పలు గ్రామాలకు చెందిన వ్యక్తులను అడిగి సమాచారం సేకరించినట్లు తెలిసింది. ఏ గ్రామంలో అక్రమంగా కొండను తవ్వుతున్నారు, వాటికి అనుమతులు ఉన్నాయా లేవా అని ఆయా గ్రామస్థులనడిగి తెలుసుకున్నట్లు సమాచారం. వీటికి రెవెన్యూ అధికారులు స్పందిస్తారో లేదో వేచిచూడాల్సిందే.

### శంకరానందగిరి కళాశాలలో విగ్రహాల ఆవిష్కరణ

గుంతకల్లు, ఫిబ్రవరి 1(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని శంకరానందగిరి కళాశాలలో ఏర్పాటు చేసిన మాజీ జడ్పీ చైర్మన్ కేసీ నారాయణ, కళాశాల ఫౌండర్ డీపీ నెట్టెప్ప విగ్రహాలను శనివారం హైకోర్టు రిటైర్డు న్యాయమూర్తి కోదండరాం, ఎమ్మెల్యే గుమ్మనూరు జయరాం, ఉమామహేశ్వర పీఠాధిపతి ప్రణవానందగిరి స్వామి ముఖ్యఅతిథులుగా హాజరై ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఉన్నత విద్య అందుబాటులో లేని రోజుల్లో పట్టణంలో ఎస్ఎస్‌జీఎస్ కళాశాలను ఏర్పాటుచేసి విద్యాదానం చేసిన మహోన్నతుడు కేసీ నారాయణ అని కొనియాడారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు, కళాశాల డైరెక్టర్ గోపాల్, కరస్పాండెంటు హరికుమార్, చైర్మన్ మురళీకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

### వివాదాస్పద ఏఓపై రెండో సారి విచారణ

గుంతకల్లు టౌన్, ఫిబ్రవరి 1(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని ప్రభుత్వ ఆసుపత్రిలో వివాదాస్పద ఏఓ రాంప్రసాద్‌పై శనివారం రెండో సారి వైద్యాధికారుల బృందం విచారణ చేపట్టింది. ఆసుపత్రిలో మహిళా సిబ్బందిపై లైంగిక వేధింపులకు పాల్పడున్న ఏఓపై చర్యలు తీసుకోవాలని కోరుతూ సెకెండరీ హెల్త్ డాక్టరేట్ ఆఫ్ కమిషనర్ డాక్టర్ సిరి, రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్‌కు వారం క్రితం విజయవాడలో సీపీఐఎంఎల్ న్యూడెమోక్రసీ పార్టీ నాయకులు ఫిర్యాదు చేశారు. దీనిపై స్పందించిన సెకెండరీ హెల్త్‌డాక్టరేట్ ఆఫ్ కమిషనర్ డాక్టర్ సిరి కర్నూలు జిల్లా ఎమ్మిగనూరు ఏరియా ఆసుపత్రి సీఎస్ఆర్ఎంఓ డాక్టర్ బాలాజీకుమార్‌ను, నంద్యాల జిల్లా డోన్ ఏరియా ఆసుపత్రి ఏఓ శైలజను, బయోమెడికల్ ఇంజనీర్ వంశీని విచారణాధికారులుగా నియమించి గుంతకల్లు ప్రభుత్వ ఆసుపత్రికి విచారణకు పంపారు. దీంతో వారు ఉదయం నుంచి సాయంత్రం వరకూ ఆసుపత్రిలోని వైద్యులు, హెడ్‌నర్సులు, నర్సులు, శానిటేషన్ సిబ్బంది, సెక్యూరిటీ సిబ్బంది, ఎంఎన్ఓలను, ఎఫ్ఎన్ఓలను ఒక్కక్కరిగా పిలిచి వారి స్టేట్‌మెంట్‌ను రికార్డు చేశారు. అనంతరం విచారణ అధికారి బాలాజీ కుమార్ మాట్లాడుతూ ఏఓ వేధింపుల వల్ల ఆసుపత్రి సిబ్బంది కన్నీళ్లు పెట్టుకొని తమకు చెప్పారన్నారు. జనవరి 31వరకు ఏఓ సెలువు పెట్టారని, ఈ రోజు విధులకు హాజరుకావాల్సి వుండగా రాలేదని అన్నారు. ఈ విషయాన్ని కూడా నివేదికలో పొందుపరిచి కమిషనర్‌కు అందజేస్తామని అన్నారు. ఆసుపత్రి సూపరిండెంటెంట్ జయవర్ధన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

### ఆలయ జీర్ణోద్ధరణకు రూ. కోటి మంజూరు

● ఉత్తర్వులు జారీ చేసిన దేవదాయ శాఖ

రాయదుర్గం, ఫిబ్రవరి 1(ఆంధ్రజ్యోతి): డీ కొండాపురంలోని పెద్ద తిమ్మప్పస్వామి ఆలయ జీర్ణోద్ధరణకు సర్వశ్రేయోనిధి నుంచి కోటి రూపాయలను మంజూరు చేస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ప్రభుత్వ విప్ కాలవ శ్రీనివాసులు విజ్ఞప్తి మేరకు ఈ నిధులు మంజూరు చేస్తున్నట్లు కాలవకు రాసిన ప్రత్యేక ఉత్తరంలో రాష్ట్ర దేవాదాయశాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి తెలియజేశారు. నిధుల విడుదలపై శనివారం ఆ శాఖ కమిషన్ ఉత్తర్వులు జారీ చేసింది. తన వినతి మేరకు నిధులు మంజూరు చేసిన మంత్రికి విప్ కాలవ కృతజ్ఞతలు తెలిపారు. ఆలయ అభివృద్ధికి సహకరించాలని భక్తులు కోరడంతో కాలవ మంత్రి ఆనం దృష్టికి తీసుకెళ్లి నిధుల మంజూరుకు కృషి చేశారు. మొత్తం రూ. 1.25 కోట్ల వ్యయంతో పునరుద్ధరణ కానున్న ఆలయానికి ప్రభుత్వం ఇచ్చే కోటి రూపాయలకు తోడు భక్తులు రూ. 25 లక్షలు సమకూర్చనున్నారు.

# పాల్తూరులో ఇక నీటి సమస్య ఉండదు

● ఆర్థిక మంత్రి పయ్యావుల కేశవ్

● గ్రామంలో కలెక్టర్‌తో కలిసి ట్రాన్స్‌ఫార్మర్ ప్రారంభం



తాగునీటి ట్యాంకు ప్రాంగణంలో మొక్క నాటుతున్న మంత్రి , కలెక్టర్

విడపనకల్లు, ఫిబ్రవరి 1(ఆంధ్రజ్యోతి): మండలంలోని పాల్తూరు గ్రామంలో ఇక నుంచి తాగునీటికి ఇబ్బంది ఉండదని, నిత్యం కరెంట్ ఉండడం వల్ల సక్రమంగా నీటి సరఫరా జరుగుతుందని ఆర్థికశాఖామంత్రి పయ్యావుల కేశవ్ తెలిపారు. గ్రామంలో తాగునీటికి ఇబ్బంది లేకుండా 24 గంటలు విద్యుత్ సరఫరా చేయడానికి గాను ట్రాన్స్‌ఫార్మర్‌ను మంత్రి కలెక్టర్ వినోద్‌కుమార్‌తో కలిసి శనివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. గత వైసీపీ ప్రభుత్వంలో విద్యుత్ సరఫరా లేక నెలకు ఒక సారి తాగు నీరు వచ్చేదన్నారు. ఒకసారి గడప గడపకు కార్యక్రమం కింద పాల్తూరు వచ్చిన అప్పటి ఎమ్మెల్యే విశ్వేశ్వరరెడ్డిని దాదాపుగా 500 మంది మహిళలు ఖాళీ బిందెలతో చుట్టు ముట్టి తాగునీరు ఇవ్వాలని నిలదీశారని, అయినా పట్టించుకున్న పాపాన పోలేదని అన్నారు. గత ఎన్నికల్లో ఇచ్చిన హామీలో భాగంగా ఈ గ్రామంలో ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు చేయించామని తెలిపారు. ఆర్‌డీ ఎస్ఎస్ నిధులతో.. పాల్తూరు విద్యుత్ సబ్‌స్టేషన్ 33బై11కేవీ నుంచి తాగునీటి ట్యాంకు వరకూ 24 గంటల విద్యుత్ సరఫరా అయ్యేలా విద్యుత్ లైన్‌ను, 25హెచ్‌పీ ట్రాన్స్‌ఫార్మర్‌ను ఏర్పాటు చేయించామని చెప్పారు. దీంతో గ్రామంలో తాగు నీటి సమస్య ఉండదన్నారు. గతంలో 20 రోజులకు, నెలకు ఒక సారి వచ్చే తాగునీరు, ఇకనుంచి రోజు విడిచి రోజు వస్తాయని తెలిపారు. తర్వాత అక్కడి తాగునీటి నీటి ట్యాంకు ప్రాంగణంలో మంత్రి, కలెక్టర్ మొక్కలు నాటారు. కార్యక్రమంలో మండల అధికారులు, ఉపాధిహామీ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## రెండేళ్లలో బీటీపీ కాలువను పూర్తి చేస్తా

● ఎమ్మెల్యే అమిలినేని సురేంద్రబాబు

● ముద్దలాపురంలో ఆర్టీసీ బస్సు సర్వీసు ప్రారంభం



బస్సు సర్వీసును ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే అమిలినేని

బ్రహ్మసముద్రం, ఫిబ్రవరి 1(ఆంధ్రజ్యోతి): రెండేళ్ల లోపు భైరవాన్‌తిప్ప ప్రాజెక్టు కాలవను పూర్తి చేసి వాటి ద్వారా హంద్రీనీవా జలాలతో నియోజకవర్గంలోని 114 చెరువులను నింపుతానని, అలా చేయకపోతే ప్రజలకు క్షమాపణ చెప్పి ఇక్కడి నుంచి వెళ్లిపోతానని ఎమ్మెల్యే అమిలినేని సురేంద్రబాబు పేర్కొన్నారు. మండలంలోని ముద్దలాపురంలో శనివారం ఆయన బస్సు సర్వీసును ఆర్టీసీ రీజనల్ చైర్మన్ పూల నాగరాజుతో కలిసి ప్రారంభించారు. అలాగే సామాజిక పింఛన్లను పంపిణీ చేశారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడుతూ.. గత వైసీపీ ప్రభుత్వంలో ఇక్కడ ఒక మంత్రి, ఎంపీ ఉండి కూడా గంపెడు మట్టి కూడా తీయలేదన్నారు. ప్రజలను మోసం చేసిన వైసీపీ వారు ఇప్పుడు పాదయాత్రలు చేస్తామంటూ ప్రకటనలు ఇవ్వడం విడ్డూరంగా ఉందన్నారు. అప్పట్లో ఐదేళ్లుగా ఎంపీగా ఉన్న తలారి రంగయ్య ఒక్కరోజు కూడా ఈ ప్రాంతానికి వచ్చిన సందర్భం లేదన్నారు. ఇప్పుడు కాలవ పనులు పూర్తి చేయకపోతే పాదయాత్రలు చేస్తానని కల్లిబొల్లి ప్రకటనలు ఇవ్వడం హాస్యాస్పదంగా ఉందన్నారు. ఎన్నో ఏళ్లుగా బస్సు సౌకర్యం లేని ముద్దలాపురం గ్రామానికి బస్సు ఏర్పాటు చేశామన్నారు. తర్వాత గ్రామస్థులు ఎమ్మెల్యేను పూలమాలలు, శాలువాలతో సన్మానించారు. కార్యక్రమంలో జడ్పీటీసీ ప్రభావతమ్మ టీడీపీ సీనియర్ నాయకులు చౌళం మల్లికార్జున, మండల కన్వీనర్ పాలబండ్ల శ్రీరాములు, కురుబ కార్పొరేషన్ డైరెక్టర్ నీలాస్వామి, క్లస్టర్ ఇన్‌చార్జి ఓబుళేసు, ఎంపీడీవో నందకిషోర్, ఎంఈవో ఓబుళపతి, టీడీపీ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## ఇంటింటికీ వెళ్లి పింఛన్ల పంపిణీ

గుంతకల్లుటౌన్, ఫిబ్రవరి 1 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని 15వ వార్డులో శనివారం ఎమ్మెల్యే గుమ్మనూరు జయరాం సామాజిక పింఛన్ల పంపిణీని అధికారులతో కలిసి చేపట్టారు. ఈసందర్భంగా మాట్లాడుతూ.. పింఛన్ల మొత్తాన్ని పెద్దఎత్తున పెంచిన ఘనత సీఎం చంద్రబాబుకే దక్కిందన్నారు. గుంతకల్లు నియోజకవర్గంలో ప్రతినెలా 36,243మంది లబ్ధిదారులకు రూ. 16.14కోట్ల మేర పింఛన్ సొమ్మును అందిస్తున్నామని చెప్పారు. అనంతరం లబ్ధిదారుల ఇంటికి వెళ్లి పింఛన్లు అందజేశారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు గుమ్మనూరు నారాయణస్వామి, బండారుఆనంద్, బీఎస్ కృష్ణారెడ్డి, తలారిమస్తానప్ప, ఆమ్లెట్‌మస్తాన్ యాదవ్, కౌన్సిలర్ గుడిపాటి ఆంజనేయులు, జనసేన నాయకులు వాసిగిరి మణికంఠ, పూలరమణ, అధికారులు పాల్గొన్నారు.

గుత్తి: మున్సిపల్ పరిధిలో పింఛన్ల పంపిణీ 95శాతం పూర్తయినట్లు మున్సిపల్ అధికారులు తెలిపారు. 25 వార్డులలో 4475 మంది వివిధ కేటగిరిల కింద పింఛన్‌దారులుండగా వారికి రూ. 2.21కోట్ల మేరకు పంపిణీ చేసినట్లు చెప్పారు.

బెళుగుప్ప: మండలంలోని గ్రామాల్లో ఉదయం 6 గంటల నుంచే పింఛన్ల పంపిణీ చేపట్టారు. సచివాలయ సిబ్బంది లబ్ధిదారుల ఇళ్ల వద్దకు వెళ్లి అందజేశారు. మండలవ్యాప్తంగా 5,689 మంది లబ్ధిదారులుండగా 5318 మందికి పంపిణీ చేసి 93.48శాతం పూర్తి చేసినట్లు ఎంపీడీవో లక్ష్మీనారాయణ తెలిపారు.

### భర్త చనిపోయిన నెలకే పింఛన్ మంజూరు

బొమ్మనహాళ్/కణేకల్లు: బొమ్మనహాళ్ మండలం శ్రీధరఘట్ట గ్రామంలో అప్పటికే పింఛన్ పొందుతున్న భర్తను కోల్పోయిన కురుబ యశోదమ్మకు నెలరోజుల్లోనే కొత్త పింఛన్ అందజేశారు. ప్రభుత్వ విప్ కాలవ శ్రీనివాసులు ఆదేశాలతో పింఛను మంజూరు చేయగా టీడీపీ మండల కన్వీనర్ బలరాంరెడ్డి, పంచాయతీ కార్యదర్శి శివన్న, మాజీ ఎంపీటీసీ తిప్పేస్వామి, వేల్ఫేర్ అసిస్టెంట్ వెంకటేశులు ఆమెకు అందజేశారు. ఆరు లేదా ఏడు నెలలకు ఒకసారి కొత్తగా పింఛన్లు మంజూరు చేసే వరకు వేచి ఉండేలా కాకుండా.. నెల రోజులకే పింఛన్‌ను కూటమి ప్రభుత్వం అందించిందని కన్వీనర్ బలరాంరెడ్డి తెలిపారు. అలాగే కణేకల్లు మండల కేంద్రంలో అచ్చుకట్ల ఫకృద్దీన్ నెలరోజుల క్రితం మృతి చెందగా ఆయన భార్య ఫాతిమాకు ఇప్పుడు కొత్త పింఛన్ అందజేసినట్లు క్లస్టర్ ఇన్‌చార్జి ఆనంద్‌రాజ్, టీడీపీ పట్టణ అధ్యక్షుడు అమీర్, నాయకులు తెలిపారు.

### పోలీసుల నాకాబందీ

ఆంధ్రజ్యోతి, న్యూస్‌నెట్‌వర్క్: రాయదుర్గం పట్టణంలోని పలు ప్రాంతాల్లో శనివారం పోలీసులు నాకాబందీ నిర్వహించారు. ఈ సందర్భంగా అనుమానితుల ఇళ్లల్లో, గడ్డివాముల్లో సోదాలు చేపట్టారు. అలాగే బొమ్మనహాళ్ మండలం నేమకల్లులో, గుత్తిపట్టణంలోని జెడ్‌వీరారెడ్డి కాలనీలో, పుట్లూరు మండలం కోమటికుంట్ల, గరుగుచింతలపల్లిలో నాకాబందీ చేపట్టారు.

### ఇసుక ట్రాక్టర్లు సీజ్

యాడికి, ఫిబ్రవరి1(ఆంధ్రజ్యోతి): ఇసుకను అక్రమంగా రవాణా చేస్తున్న మూడు ట్రాక్టర్లను శనివారం సీజ్ చేసినట్లు ఎస్ఐ వెంకటరమణయ్య తెలిపారు. వేములపాడు క్రాస్ వద్ద వాహనాల తనిఖీ చేస్తుండగా ఇసుక అక్రమ రవాణా చేస్తున్న ట్రాక్టర్లు మూడింటిని గుర్తించామన్నారు. వెంటనే సీజ్‌చేసి పోలీస్‌స్టేషన్‌కు తరలించామని చెప్పారు.

### హెచ్చెల్సీలో మహిళ మృతదేహం లభ్యం

ఉరవకొండ, ఫిబ్రవరి 1(ఆంధ్రజ్యోతి): మండలంలోని నింబగల్లు సమీపంలో గల హెచ్చెల్సీలో శనివారం గుర్తు తెలియని మహిళ మృతదేహం లభ్యమైంది. కాలువలో మహిళ మృతదేహం ఉండడాన్ని స్థానికులు గుర్తించి పోలీసులకు సమాచారం ఇచ్చారు. పోలీసులు వెంటనే అక్కడికి చేరుకుని మృతదేహాన్ని బయటకు తీసి అక్కడే పోస్టుమార్టం నిర్వహించారు. అనంతరం కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు.

### రోడ్డు ప్రమాదంలో యువకుడి మృతి



మృతి చెందిన మైలరాజు

గుంతకల్లుటౌన్, ఫిబ్రవరి 1 (ఆంధ్రజ్యోతి): మండలంలోని నక్కనదొడ్డి గ్రామ సమీపంలోని టోల్‌గేట్ వద్ద శనివారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ యువకుడు మృతి చెందాడు. గుత్తి మండలం అనగా నదొడ్డి గ్రామానికి చెందిన కృష్ణమూర్తి, సోమేశ్వరి దంపతుల కుమారుడు మైలరాజు (21) తాడిపత్రి సమీపంలో ఓ గ్రానైట్ ఫ్యాక్టరీలో కార్మికుడిగా పని చేసేవాడు. అతడి తండ్రి గ్రామంలోనే డిష్ నిర్వహిస్తున్నాడు. కాగా మైలరాజు సెటప్ బాక్స్‌ల కోసం బైక్‌లో గుంతకల్లుకు వచ్చాడు. వాటిని తీసుకొని స్వగ్రామానికి వెళ్తుండగా నక్కనదొడ్డి సమీపంలో టోల్‌గేట్ వద్ద బైక్ అదుపు తప్పి కిందపడి గాయపడ్డాడు. గమనించిన స్థానికులు అతడిని గుంతకల్లు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. వైద్యులు పరీక్షించి అప్పటికే మృతి చెందినట్లు నిర్ధారించారు. రూరల్ పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

### బైక్‌ను ఢీకొన్న కారు.. ఒకరికి తీవ్రగాయాలు

కళ్యాణదుర్గంరూరల్, ఫిబ్రవరి 1(ఆంధ్రజ్యోతి): మండలంలోని సీబాయి గ్రామం వద్ద శనివారం ద్విచక్రవాహనాన్ని కారు ఢీకొనడంతో ఒకరికి తీవ్రగాయాలయ్యాయి. గంగవరం గ్రామానికి చెందిన బసప్ప సీబాయి వద్ద ఉన్న తన పొలానికి ద్విచక్ర వాహనంలో వెళుతుండగా.. కళ్యాణదుర్గం నుంచి అనంతపురం వైపు వేగంగా వెళుతున్న కారు ఢీకొంది. ప్రమాదంలో అతడి తలకు తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు వెంటనే కళ్యాణదుర్గం ప్రభుత్వాస్పత్రికి తరలించారు. పరిస్థితి విషమంగా వుండటంతో అనంతపురం ప్రభుత్వాస్పత్రికి తరలించారు. రూరల్ పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

### అగ్నిప్రమాదంలో కంది పంట దగ్ధం

బెళుగుప్ప, ఫిబ్రవరి 1(ఆంధ్రజ్యోతి): మండలంలోని హనిమిరెడ్డిపల్లిలో శనివారం ప్రమాదవశాత్తు చోటుచేసుకున్న అగ్నిప్రమాదంలో కందిపంట దగ్ధమైంది. అటవీ ప్రాంతం సమీపంలో ఉన్న తన ఆరు ఎకరాల పొలంలో రైతు చంద్రప్ప కంది పంట సాగుచేశారు. కాగా అటవీ ప్రాంతానికి గుర్తు తెలియని వ్యక్తులు నిప్పంటించడంతో మంటలు చెలరేగి సమీపంలోని కంది పంటకు సోకాయి. దీంతో పంటతో పాటు అక్కడి డ్రిప్ పరికరాలు కూడా కాలిపోయినట్లు బాధిత రైతు వాపోయాడు. అగ్నిమాపక సిబ్బంది చేరుకుని మంటలార్పారు. ప్రమాదంలో రూ. రెండున్నర లక్షల నష్టం వాటిల్లిందని, ప్రభుత్వం ఆదుకోవాలంటూ బాధితుడు కోరాడు.

### నూతన రథానికి ప్రత్యేక పూజలు

కుందుర్పి, ఫిబ్రవరి 1 (ఆంధ్రజ్యోతి): మండలంలోని అపిలేపల్లి గ్రామంలో గల బొబ్బిళ్లకుంట ఆంజనేయస్వామి ఆలయానికి సంబంధించి నూతన రథం గ్రామానికి శనివారం చేరుకుంది. గ్రామస్థులు పెద్దఎత్తున స్వాగతం పలుకుతూ.. వేదపండితుల చేత ప్రత్యేక పూజలు నిర్వహించారు. గతేడాది రథోత్సవం సందర్భంగా రథం కుప్పకూలి విరిగి పోయింది. దీంతో గ్రామస్థులు నూతన రథాన్ని ఏర్పాటు చేయాలని సంకల్పించి దాదాపుగా రూ. కోటి వెచ్చించారు. నూతన రథం తయారై గ్రామానికి చేరుకోవడంతో పెద్దఎత్తున వచ్చి కొబ్బరికాయలు కొట్టారు. ఈ నెల 13న రథోత్సవం అంగరంగ వైభవంగా నిర్వహించనున్నట్లు గ్రామ పెద్దలు తెలిపారు.

### కందుల తుకాల్లో మోసాలను అరికట్టాలి: సీపీఐ

గుంతకల్లుటౌన్, ఫిబ్రవరి 1(ఆంధ్రజ్యోతి): కందుల కొనుగోలు తుకాల్లో జరుగుతున్న మోసాన్ని అరికట్టాలని సీపీఐ నాయకులు పేర్కొన్నారు. పట్టణంలోని మార్కెట్‌యార్డులో కందుల కొనుగోలు కేంద్రాన్ని శనివారం వారు పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రభుత్వ నిబంధనల మేరకు కందులను కొనుగోలు చేయాలని, అయితే ఇక్కడ ఆ పరిస్థితులు లేవని అన్నారు. 100కేజీలకు గాను కేజీ, కేజీన్నర వ్యత్యాలతో కందులు కొనుగోలు చేస్తున్నారన్నారు. రైతులు కందులను కొనుగోలు కేంద్రాలకు తెస్తే తుకాలలో మోసాలు జరుగుతున్నాయన్నారు. తేమ శాతంతో సంబంధం లేకుండా ప్రభుత్వమే మద్దతు ధరతో కొని రైతులు మోసపోకుండా చూడాలన్నారు. కలెక్టర్, ఆర్డీఓ కందుల కొనుగోలు కేంద్రాలను పరిశీలించి రైతులకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సీపీఐ నియోజకవర్గ కార్యదర్శి వీరభద్రస్వామి, సహాయ కార్యదర్శి మహేష్, మండల కార్యదర్శి రాము, పట్టణ కార్యదర్శి గోపినాథ్, సహాయ కార్యదర్శి ఎస్ఎండీ గౌస్, రైతు సంఘం నియోజకవర్గకార్యదర్శి రామాంజనేయులు, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా మార్కండేయస్వామి జయంతి



గుంతకల్లులో స్వామిని దర్శించుకుంటున్న ఎమ్మెల్యే జయరాం తదితరులు

తాడిపత్రి, ఫిబ్రవరి 1(ఆంధ్రజ్యోతి): మార్కండేయస్వామి జయంత్యుత్సవాల సందర్భంగా పట్టణంలోని మార్కండేయుడి ఆలయంలో శనివారం ప్రత్యేక పూజలు ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా అర్చకులు వేకువజామునే భద్రావతి, భావనారుషీశ్వరులకు, మార్కండేయ స్వామికి అభిషేకాలు, ప్రత్యేక అలంకరణలు చేసి పూజలు నిర్వహించారు. ఈ వేడుకలకు మున్సిపల్ చైర్మన్ జేసీ ప్రభాకర్‌రెడ్డి హాజరై స్వామివార్లకు ప్రత్యేక పూజలు చేయించారు. అనంతరం ఆలయ నిర్వాహకులు మార్కండేయుడి ఉత్సవమూర్తిని ప్రత్యేక వాహనంలో ఉంచి మంగళవాయిద్యాల నడుమ పట్టణ పురవీధుల్లో ఊరేగించారు. ఊరేగింపులో చిన్నారులు చేసిన నృత్యాలు ఆకట్టుకున్నాయి. భక్తులు, టీడీపీ నాయకులు పెద్దఎత్తున పాల్గొన్నారు.

గుంతకల్లుటౌన్: పట్టణంలోని బీఎస్ఎస్ కాలనీలో గల మార్కండేయ స్వామి ఆలయంలో స్వామి వారికి అభిషేకాలు, ప్రత్యేక అలంకరణలు, పూజలు నిర్వహించారు. ఎమ్మెల్యే గుమ్మనూరు జయరాం హాజరై స్వామిని దర్శించి అర్చనలు చేయించి తీర్థప్రసాదాలు పొందారు. సాయంత్రం నిర్వాహకులు స్వామివారి ఉత్సవ మూర్తిని రథంలో కొలువుదీర్చి మేళతాళాల మధ్య పురవీధుల్లో ఊరేగించారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ అధ్యక్షుడు బాలాజీ రామసుబ్బయ్య, ప్రధాన కార్యదర్శి టీ గోపి, ఉపాధ్యక్షులు పూల నాగరాజు,బోడనాగరాజు, సంగమేష్, రాము, టీడీపీ ఇన్చార్జి గుమ్మనూరు నారాయణస్వామి, నాయకులు పాల్గొన్నారు.

బొమ్మనహాళ్: మండలంలోని ఉంతకల్లులో భక్త మార్కండేయ ఆలయ 34వ వార్షికోత్సవ వేడుకలు పద్మశాలి సంఘం ఆధ్వర్యంలో వైభవంగా జరిగాయి. ఈ సందర్భంగా అర్చకులు స్వామివారికి ప్రత్యేక అలంకరణలు, పూజలు, హోమాలు నిర్వహించారు. అనంతరం మహామంగళారతి ఇచ్చారు. ఆలయ ధర్మకర్త బంకా చంద్రశేఖర్, కమిటీ సభ్యులు , టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

### అశ్వత్థ నారాయణుడికి పట్టువస్త్రాల సమర్పణ



పట్టువస్త్రాలు సమర్పిస్తున్న జేసీపీఆర్ దంపతులు

పెద్దపప్పూరు, ఫిబ్రవరి 1(ఆంధ్రజ్యోతి): మండలంలోని అశ్వత్థం తిరుణాల ప్రారంభం సందర్భంగా శనివారం అశ్వత్థ నారాయణస్వామికి, శ్రీచక్ర భీమలింగేశ్వరస్వామికి తాడిపత్రి మున్సిపల్ చైర్మన్ జేసీ ప్రభాకర్‌రెడ్డి, జేసీ ఉమారెడ్డి దంపతులు పట్టువస్త్రాలు, పసుపు, కుంకుమ అందజేశారు. తొలుత వారికి స్థానిక అధికారులు, అర్చకులు ఘన స్వాగతం పలికి స్వాముల దర్శనం చేయించారు. అర్చనలు, ప్రత్యేక పూజలు చేయించి తీర్థ ప్రసాదాలు పంపిణీ చేశారు. తర్వాత జేసీపీఆర్ దంపతులు పట్టువస్త్రాలు సమర్పించారు.

### బొలికొండ రంగనాథ స్వామికి ప్రత్యేక పూజలు



ప్రత్యేక అలంకరణలో స్వామి, అమ్మవార్లు

గుత్తిరూరల్, ఫిబ్రవరి 1(ఆంధ్రజ్యోతి): మాఘ మాసం సందర్భంగా మండలంలోని తొండపాడులో గల బొలికొండ రంగనాథ స్వామికి శనివారం ప్రత్యేక పూజలను ఘనంగా నిర్వహించారు. స్వామి వేకువజామునే అర్చకులు స్వామి, అమ్మవార్ల మూలవిరాట్‌లకు పలు అభిషేకాలు, అలంకరనలు చేసి ప్రత్యేక పూజలు జరిపారు. తర్వాత మహా మంగళ హారితినిచ్చారు. భక్తులు పెద్దఎత్తున దర్శించుకుని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.

### డీజిల్ దొంగల అరెస్టు

తాడిపత్రి, ఫిబ్రవరి 1(ఆంధ్రజ్యోతి): మండలంలోని తలారిచెరువు సమీపంలో ఉన్న అదాని సిమెంట్స్ ఫ్యాక్టరీ వద్ద ఉన్న పయనీర్ ట్రాన్స్‌పోర్ట్ గ్యారేజీలో శనివారం తెల్లవారుజామున ముగ్గురు డీజిల్ దొంగలను అరెస్టు చేసి వారివద్ద నుంచి 40లీటర్ల డీజిల్, బొలెరోవాహనాన్ని స్వాధీనం చేసుకున్నామని రూరల్ సీఐ శివగంగాధర్‌రెడ్డి తెలిపారు. గ్యారేజీలో పార్కింగ్ చేసి ఉన్న లారీల్లో డీజిల్‌ను బొలెరో వాహనంలో వచ్చిన ఏడుగురు అపహరిస్తుండగా.. అక్కడే ఉన్న సెక్యూరిటీ గార్డులు గుర్తించి ముగ్గురిని అదుపులోకి తీసుకున్నారన్నారు. మిగతా నలుగురు పారిపోయారని తెలిపారు. వెంటనే తాము సిబ్బందితో వెళ్లి పట్టుబడిన ముగ్గురినీ అరెస్టు చేశామన్నారు. వారు యాడికి మండలం గుడిపాడు గ్రామానికి చెందిన వెంకటరమణ, నంద్యాల జిల్లా సంజామల మండలం రామిరెడ్డిపల్లికి చెందిన యేసు, నాగేశ్వరరావుగా గుర్తించామని చెప్పారు. పారిపోయిన నలుగురిని త్వరలోనే పట్టుకుంటామని సీఐ పేర్కొన్నారు.

### మోటార్ల దొంగలు..

పెద్దవడుగూరు, ఫిబ్రవరి 1(ఆంధ్రజ్యోతి): రైతుల పొలాల్లో ఉన్న విద్యుత్ బోరు మోటార్లను అపహరిస్తున్న ముగ్గురిని శనివారం అరెస్టు చేసినట్లు సీఐ రామసుబ్బయ్య, ఎస్ఐ ఆంజనేయులు తెలిపారు. పామిడి మండలం రామరాజుపల్లికి చెందిన తలారి సుధీర్, గుత్తి మండలం ఎర్రగుడి గ్రామానికి చెందిన ఓబులేసు శుక్రవారం అర్ధరాత్రి మండలకేంద్రంలో అనుమానాస్పదంగా బైక్‌లో తిరుగుతున్నారని, వెంటనే అదుపులోకి తీసుకుని విచారించగా రైతుల పొలాల్లో బోరుమోటార్లను అపహరించి అందులో ఉన్న రాగిని గుత్తి పట్టణానికి చెందిన గుజిరి వ్యాపారి వన్నూరుస్వామికి విక్రయించేవారమని తెలిపారన్నారు. అనంతరం వారి నుంచి పెద్దవడుగూరు, పామిడి మండలాల్లోని రైతుల పొలాల్లో అపహరించిన మూడు మోటార్లను, ద్విచక్రవాహనాన్ని స్వాధీనం చేసుకున్నామన్నారు. కేసు నమోదు చేసి రిమాండ్‌కు పంపినట్లు తెలిపారు. సిబ్బంది పాల్గొన్నారు.

### చెత్తనుంచి సంపద తయారీ కేంద్రం పరిశీలన

గుత్తిరూరల్, ఫిబ్రవరి 1(ఆంధ్రజ్యోతి): మండలంలోని చెర్లోపల్లి గ్రామంలో గల చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాన్ని జడ్పీ సీఈఓ రామచంద్ర రెడ్డి శనివారం పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. పంచాయతీకి ఆదాయం చేకురాలంటు చెత్త నుంచి సంపద సృష్టించాలన్నారు. వర్మీ కంపోస్టు ఎరువులను తయారు చేసి రైతులకు అందజేయాలని తెలిపారు. తద్వారా పంచాయతీలకు ఆదాయం వస్తుందని చెప్పారు. ఎంపీడీఓ ప్రభాకర్ నాయక్, ఈఓఆర్డీ శివాజీరెడ్డి, సర్పంచు వెంకటేష్, తదితరులు పాల్గొన్నారు.

### విషపునీరు తాగి 17 గొర్రెలు మృతి

కణేకల్లు, ఫిబ్రవరి 1(ఆంధ్రజ్యోతి): మండలంలోని జక్కలవడికి గ్రామంలో శనివారం విషపునీరు తాగి 17 గొర్రెలు మృతి చెందినట్లు బాధితులు తెలిపారు. గ్రామంలో రాముడుకు చెందిన 12 గొర్రెలు, వన్నూరుస్వామికి చెందిన 5 గొర్రెలు గ్రామసమీపంలో మేతకు వెళ్లాయి. కాగా వైసీపీ ఎంపీటీసీ సభ్యుడు రామిరెడ్డి అక్కడే ఉన్న తన పొలంలో వంగ పంటకు స్ప్రే చేసేందుకు పురుగులమందు కలిపిన నీటిని ఉంచాడు. గొర్రెలు ఆ నీటిని తాగి అపస్మారక స్థితికి చేరుకుని మృతి చెందాయి. గొర్రెల యజమాని వన్నూరుస్వామి కుమారుడు గణేష్ కూడా ఆ నీటిని తాగి అపస్మారక స్థితికి చేరుకోగా చికిత్స కోసం రాయదుర్గం ప్రభుత్వాసుపత్రికి, ఆ తర్వాత మెరుగైన చికిత్స కోసం బళ్లారి ఓపీడీకి తరలించారు. ఈ విషయంపై పోలీసులు కేసు నమోదు చేసుకున్నారు.

### గొర్రెల పెంపకం దార్ల సంఘం ఎన్నిక ఏకగ్రీవం

కుందుర్పి, ఫిబ్రవరి 1(ఆంధ్రజ్యోతి): మండలంలోని రుద్రంపల్లి గ్రామంలో గొర్రెలు పెంపకం దారుల సంఘం ఎన్నికలు శనివారం ఏకగ్రీవంగా జరిగినట్లు పశువైద్యాధికారి ప్రసాద్ తెలిపారు. అధ్యక్షుడిగా హరీష్, ఉపాధ్యక్షుడిగా శివప్పతో పాటు ఏడుగురు డైరెక్టర్లను ఎన్నుకున్నట్లు చెప్పారు. టీడీపీ నాయకులు రాఘవేంద్రబాబు, చిత్రలింగ, ఎంపీటీసీ మెంబర్ మల్లికార్జున తదితరులు పాల్గొన్నారు.

### 7న హైదరాబాద్‌కు తరలిరండి

రాయదుర్గం రూరల్, ఫిబ్రవరి 1(ఆంధ్రజ్యోతి): హైదరాబాద్‌లో ఈ నెల 7న మందకృష్ణ మాదిగ ఆధ్వర్యంలో జరిగే వేల గొంతుకలు, లక్షల డప్పుల మహా ప్రదర్శనను విజయవంతం చేయాలని ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షుడు హరిగోపాల్, తాలూకా కార్యదర్శి తిప్పేస్వామి పిలుపునిచ్చారు. ఈ మేరకు పట్టణంలో శనివారం అంబేడ్కర్ విగ్రహం నుంచి లక్ష్మీబజార్ వరకు 100 డప్పులతో సన్నాహక ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మహా ప్రదర్శనకు ప్రతిఒక్కరూ తరలిరావాలని కోరారు. ఎమ్మార్పీఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి పెన్నప్ప, నాయకులు భీమరాజు, రాము తదితరులు పాల్గొన్నారు.

### వైభవంగా కన్యకాపరమేశ్వరి స్వర్ణోత్సవాలు

బెళుగుప్ప, ఫిబ్రవరి 1(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని వాసవీ మాత ఆలయంలో శనివారం ఆర్యవైశ్యుల ఆధ్వర్యంలో కన్యకాపరమేశ్వరీ దేవి స్వర్ణోత్సవాలు కన్నుల పండువగా జరిగాయి. ఈ సందర్భంగా వేదపండితులు అమ్మవారికి సుప్రభాతసేవ, గంగపూజ, అష్టబంధ హోమాలు నిర్వహించారు. తర్వాత ఆలయ ప్రాంగణంలో వేద మంత్రోచ్చారణలతో హోమాలు నిర్వహించారు. ఇక సాయంత్రం వాస్తుహోమం, పూర్ణాహుతి, మహామంగళహారతి ఇచ్చారు. భక్తులు పెద్దఎత్తున పాల్గొన్నారు. ఆదివారం గోపుర కలశప్రతిష్ఠ, సోమవారం నవగ్రహ హోమం, మహాకుంభాభిషేకం, మహామంగళహారతితో స్వర్ణోత్సవాలు ముగుస్తాయని ఆర్యవైశ్యసంఘం సభ్యులు తెలిపారు.



హోమాలు నిర్వహిస్తున్న వేదపండితులు